దర్శించండి - తరించండి



స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వాములు కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 188 | ది.27-10-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 188 | Date : 27-10-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


## రాష్ట్రపతి తో గవర్నర్ భేటీ



**హైదరాబాద్,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణి జానకి శుక్లాతో కలిసి సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రాష్ట్రపతితో గవర్నర్ దంపతులు భేటీ అయ్యారు.

# జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే న్యాయ సేవలు శ్లాఘనీయం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ ఘన నివాళి
- ఏపీ హైకోర్టులో జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే సంతాప సభ





**అమరావతి, అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే న్యాయ సేవలు శ్లాఘనీయమని, ఆయన సూక్ష్మ పరిశీలనతో కేసులు పరిశీలించిన విధానం యువ న్యాయవాదులకు ఆదర్శనీయమని ఏపీ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా పని చేసిన దివంగత జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే సంతాప సభ సోమవారం మొదటి కోర్టు హాల్ లో నిర్వహించారు. ముందుగా జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే మృతికి సంతాప సూచకంగా ఫుల్ కోర్టు నిమిషం మౌనం పాటించి ఘన నివాళులర్పించింది. జస్టిస్ బాటే కుటుంబ సభ్యులకు కోర్టు హాల్ లో నిర్వహించే సంతాప సభ కార్యక్రమాన్ని వర్చువల్ గా పాల్గొనేలా అవకాశం కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే 25 నవంబర్ 1937 సంవత్సరంలో మహారాష్ట్రలో జన్మించారని తెలిపారు. చిన్నతనం నుండి జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే చదువులోనూ,ఆటల్లోనూ చురుకైన విద్యార్థిగా గుర్తింపు పొందారని అన్నారు. ముఖ్యంగా క్రీడల్లో క్రికెట్,హాకీ,టెన్నిస్ లపై మక్కువ చూపేవారని గుర్తు చేశారు. ఆయన మహారాష్ట్రలో న్యాయవాదిగా మరియు జ్యుడీషియల్ సర్వీసెస్‌లో కెరీర్‌ను ప్రారంభించారని తెలిపారు. ఆయన చట్టపరమైన పరిజ్ఞానాన్ని గుర్తించి 1994 అక్టోబరు 6న బొంబాయి హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమించడం జరిగిందన్నారు. అదే ఏడాది బదిలీపై 1994 నవంబరు 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు వచ్చారని, 1996 జూన్ 3న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. ఉమ్మడి ఏపీ హైకోర్టులో తన పదవీ కాలంలో డివిజన్ బెంచ్ మరియు సింగిల్ జడ్జిగా వేలాది కేసులను పరిష్కరించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. 1999 నవంబరు 25న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేయడం జరిగిందన్నారు. రిటైర్మెంట్ తర్వాత జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే 'మహారాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్' (ఎంఏటి) ఔరంగాబాద్ బెంచ్ వైస్ చైర్మన్‌గా రెండేళ్ల పాటు సేవలు అందించారని తెలిపారు. జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే కేసు రికార్డులను అత్యంత క్షుణ్ణంగా పరిశీలించడంలో, నిష్పాక్షికతతో వ్యవహరించడంలో మరియు న్యాయం పట్ల అచంచలమైన నిబద్ధతను ప్రదర్శించడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని స్మరించుకున్నారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ అడ్వకేట్ అసోసియేషన్ ప్రసిడెంట్ ప్రభునాథ్ వాసిరెడ్డి లు జస్టిస్ అవినాష్ సోమకాంత్ బాటే న్యాయ ప్రస్తానాన్ని స్మరించుకుంటూ ఆయన చూపిన బాట అందరికీ ఆదర్శనీమని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. లక్ష్మీనారాయణ,ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ బాలాజీ,బార్ కౌన్సిల్ ప్రతినిధులు,ప్రభుత్వ సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# తుఫానుతో రేపు ఎల్లుండి భారీ వర్షాలకు ఆస్కారం

- ఆస్తి, ప్రాణనష్టం లేకుండా ముందస్తు జాగ్రత్తలు
- వరద ముంపు ప్రాంతాల్లో షెల్టర్లకు బాధితుల తరలింపు
- తుఫాను గమనం అంచనా వేస్తూ ప్రతి 4 గంటలకూ హెచ్చరికలు జారీ
- అర్నబ్ తుఫాన్ పరిస్థితిపై గంట గంటకూ సమీక్షిస్తోన్న సీఎం చంద్రబాబు



**అమరావతి,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో సీఎం వం-ర్చువల్‌గా సమీక్షించారు. రేపటి కల్లా తీవ్ర తుఫానుగా మారి ఇది రాష్ట్రంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం హెచ్చరికల రీత్యా ఆయా తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ నెల 28వ తేదీన అర్నబ్ తీవ్ర తుఫాను బాపట్ల-విశాఖ మధ్య యానాం వద్ద తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాను కారణంగా రేపు మధ్యాహ్నం నుంచి శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకూ వివిధ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపారు. అలాగే తీరప్రాంతాల వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని సీఎంకు తెలియచేశారు. తుఫాను ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర జిల్లాలు, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పలనాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ నెల 28,29 తేదీల్లో భారీ వర్షాలు, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వివరించారు. అర్నబ్ తుఫాన్ విషయంలో రాష్ట్రం తీసుకుంటున్న ముందస్తు చర్యలను ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**షెల్టర్లకు లోతట్టు ప్రాంతాల ప్రజలు..** తుఫాను ప్రభావం నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను తుఫాను షెల్టర్లకు తరలించాలని సీఎం నిర్ద?శించారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, శిశువులకు తొలి ప్రాధాన్యతనిచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,711 మంది గర్భిణీలను ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, ఆస్పత్రులకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రభావిత జిల్లాల్లోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య బృందాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్ 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 ప్రభావిత జిల్లాల్లో మోహరించాలని సీఎం సూచించారు. ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో అదనపు బలగాలను రిజర్వ్‌లో ఉంచాన్నారు. మెరైన్ పోలీసులతో పాటు నౌకాదళంతోపాటు కోస్టుగార్డుల సేవలను ఈ తుఫాన్ సహాయక చర్యల్లో వినియోగించుకునేలా చూడాలని సీఎం నిర్దేశించారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ సురక్షితంగా తీరప్రాంతానికి తిరిగి రప్పించామని అధికారులు వివరించారు. మొత్తం 30,043 పడవలు సురక్షితంగా హార్బర్‌లకు చేరుకున్నాయని తెలిపారు. తుఫాను బలహీన పడి సముద్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు.

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లో పాల్గొనండి

- మహారాష్ట్ర ముఖ్యమంత్రి కి సి.ఎం. రేవంత్ రెడ్డి ఆహ్వానం



**హైదరాబాద్, అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవంద్ర ఫడ్నవీస్ ని ఆహ్వానించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీకి సంబంధించి జరిగిన సమావేశం అనంతరం రేవంత్ రెడ్డి ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్ వివరాలను తెలియజేస్తూ పాల్గొనాల్సిందిగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి ని అహ్వానించారు. అందుకు ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. ఆ సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.


**మహారాజశ్రీ నందిగామ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు**

I.A.No.1158/2025

IN

O.S. No: 387/2025

Between:

మందా నాగరాజు -----పిటిషనర్

AND

గుర్రం జాన్ విక్టర్ బాబు -----రెస్పాండెంట్

**రెస్పాండెంట్ చిరునామా :**

గుర్రం జాన్ విక్టర్ బాబు

S/o ప్రభుదాస్,

హిందూ, వయసు 43 సం॥లు,

వ్యవసాయం,

నివాసం: D.No.3-2A, లింగాపురం గ్రామం, అమరావతి మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు పిటీషన్ పిటీషనర్, రెస్పాండెంట్ మీద అతని ఆస్తి అటాచ్మెంట్ కొరకు పిటీషన్ను పైన తెలుపబడిన కోర్టులో దాఖలు చేసినారు. సదరు పిటీషన్లో పిటీషనర్, రెస్పాండెంట్కి పిటిషన్ నోటీసుల నిమిత్తము ఎన్నిమార్లు బేటాలు కట్టినను, సదరు పిటీషన్ నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ప్రత్యామ్నాయ అమలు నిమిత్తము పిటీషనర్ శ్రీ కోర్టు వారి నుండి పత్రిక ప్రకటన కొరకు ఆర్డర్ పొందిఉన్నారు. ది.30-10-2026వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై తెలుపబడిన కోర్టులో రెస్పాండెంటు వైన నీవు కాని, నీ తరపున న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేని యెడల శ్రీ కోర్టు వారి మీకు పరోక్షముగా తీర్మానించదరని యిందుమూలంగా తెలియజేయడమైనది.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా తేదీ :** 30-10-2026

**సమయం ఉదయం:** 10.30ని॥లకు

**కోర్టు :** నందిగామ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు నందిగామ

ఇట్లు

**S.M.K. Azad** (AP/381/2015)

ADVOCATE

NANDIGAMA-521 185

NTR DIST, 9848738316



**మహారాజశ్రీ నందిగామ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు**

O. S. No: 387/2025

Between:

మందా నాగరాజు ----వాది

AND

గుర్రం జాన్ విక్టర్ బాబు -----ప్రతివాది

**ప్రతివాది చిరునామా :**

గుర్రం జాన్ విక్టర్ బాబు

S/o ప్రభుదాస్,

హిందూ, వయసు 43 సం॥లు,

వ్యవసాయం,

నివాసం: D.No.3-2A, లింగాపురం గ్రామం, అమరావతి మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావా వాది, ప్రతివాది మీద ప్రామిసరీ నోట్ అమౌంట్ రికవరీ కోరకు దావాను పైన తెలుపబడిన కోర్టులో దాఖలు చేసినారు. సదరు దావాలో వాది, ప్రతివాదికి దావా సమన్ల నిమిత్తము ఎన్నిమార్లు బేటాలు కట్టినను, సదరు దావా సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ప్రత్యామ్నాయ అమలు నిమిత్తము వాది శ్రీ కోర్టు వారి నుండి పత్రిక ప్రకటన కొరకు ఆర్డర్ పొందిఉన్నారు. ది.30-10-2026వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై తెలుపబడిన కోర్టులో ప్రతివాదివైన నీవు కాని, నీ తరపున న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేని యెడల శ్రీ కోర్టు వారి మీకు పరోక్షముగా తీర్మానించదరని యిందుమూలంగా తెలియజేయడమైనది.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా తేదీ : 30-10-2026**

**సమయం ఉదయం:** 10.30ని॥లకు

**కోర్టు :** నందిగామ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు నందిగామ

ఇట్లు

**S.M.K. Azad** (AP/381/2015)

ADVOCATE

NANDIGAMA-521 185

NTR DIST, 9848738316



**ప్రకటన**

**మహారాజశ్రీ 4 అదనపు జిల్లా జడ్జి మరియు ప్రిన్సిపల్ ఫ్యామిలీ జడ్జి కోర్టు విజయవాడ**

F.C.O.P. No. 1130 /2025

Between:

జుజ్జవరపు తరుణ్ కుమార్ -----పిటీషనర్

AND

1. జుజ్జవరపు లావణ్య
2. పుణ్యమంతుల సతీష్ కుమార్ -------రెస్పాండెంట్స్

**రెస్పాండెంట్ నెం.2 అడ్రస్:**

పుణ్యమంతుల సతీష్ కుమార్

తండ్రి. సత్యనారాయణ,

నివాస డోర్ నెం: 80-1-8/4, 4వ వీధి, AVA రోడ్డు, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా.

పై నెంబరు పిటిషన్ లో మీరు ప్రతివాదియైన పుణ్యమంతుల సతీష్ కుమార్, మీకు అనేక సార్లు పై కోర్టు వారి నుండి దావా సమన్లు పంపిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు ది. 18-11-2026 నకు వాయిదా వేసిఉన్నారు. కావున మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని సదరు కోర్టు వారి ఎదుట ది. 18-11-2026 న తేదీన ఉదయం గం.10.30 ని.లకు మీరు హాజరు కాగలరు. లేని యెడల సదరు దావాలో మీకు పరోక్షంగా తీర్మానించెదరని యిందు మూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 18-11-2026

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పేపరు పబ్లికేషన్ ద్వారా మీకు తెలియజేయటమైనది.

ఇట్లు :

**జుజ్జవరపు తరుణ్ కుమార్**

తండ్రి. విశ్వేశ్వరరావు,

నివాసం: సాయి నిలయం,

పోరంకి, నారాయణపురం కాలనీ,

కృష్ణా జిల్లా.


## జూనియర్ సివిల్ జడ్జిగా శ్రీమతి కె దేవ హనీష

- ఒకే కుటుంబంలో ముగ్గురు న్యాయమూర్తులు.



**హైదరాబాద్,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ సర్వీస్ వారు నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పోస్టులలో జూనియర్ సివిల్ జడ్జిగా శ్రీమతి కాళంగి దేవ హనీష విజయం సాధించారు. వీరు విజయవాడలోని సిద్ధార్థ లా కాలేజీలో ఎల్.ఎల్.బి. మరియు ఆంధ్ర యూనివర్సిటీ నుంచి ఎల్. ఎల్. ఎం. పూర్తి చేశారు. వీరు 2021 నుండి తెలంగాణ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తూ గత వారం విడుదలైన ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైనారు. వీరి నాన్నగారు మరియు మామగారు ఇద్దరూ కూడా న్యాయమూర్తులుగా ఆంధ్రప్రదేశ్ లో న్యాయ రంగంలో సేవలు అందించటం విశేషం. విశాఖ లోని గౌరవ 15వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న శ్రీ కె వెంకటేశ్వరరావు మరియు శ్రీమతి పద్మావతి గార్ల దంపతుల కుమార్తె అయినా శ్రీమతి దేవ హనీష మామ గారు శ్రీ గింజాల. గంగ రాజు గారు. వీరు నర్సాపురం లో గౌరవ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు.

# మంగళగిరి టీడీపీలోకి పెద్ద ఎత్తున చేరికలు

- అందరికీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి నారా లోకేష్



**మంగళగిరి,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** మంగళగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామానికి చెందిన సీపీఎం మండల కమిటీ మాజీ సభ్యుడు, కాట్రగడ్డ శివన్నారాయణతో పాటు ఆ పార్టీకి చెందిన 100 కుటుంబాలు, మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన సీపీఎం మండల మాజీ కార్యదర్శి, మాజీ ఉప సర్పంచ్ ముసలి జ్యోతిబసుతో పాటు 40 కుటుంబాలు మంత్రి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరాయి. దుగ్గిరాల మండలం పేరుకలపూడికి చెందిన వైసీపీ సీనియర్ నేత నూతలపాటి చెన్నకేశవరావుతో పాటు 10 కుటుంబాలు, దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన వైసీపీ నేత ఉయ్యూరు వెంకటేశ్వరరావుతో పాటు వైసీపీకి చెందిన 15 కుటుంబాలు, ఈమనికి చెందిన వైసీపీ నేత ముద్రబోయిన శ్రీనుతో పాటు 15 కుటుంబాలు, దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామానికి చెందిన వైసీపీ నేత షేక్ యూసబ్ తో పాటు 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఉండవల్లి నివాసంలో వీరందరికీ టీడీపీ కండువాలు కప్పి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**అత్యధిక మెజార్టీతో గెలిపించారు..** ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో 21 రోజుల ముందు మంగళగిరికి వచ్చాను. నేనేంటో మీకు అర్థం కాలేదు. మీ సమస్యలేంటో నాకు తెలియవు. ఫలితంగా 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు ప్రజల్లో ఉండి వారి సమస్యలు అర్థం చేసుకున్నా. మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం 26 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ పరంగా చేపట్టాం. అంతకుముందు 15 ఏళ్లు మంగళగిరి నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన వారు చేసిన అభివృద్ధిని, నేను చేపట్టిన కార్యక్రమాలను బేరీజు వేసుకుని 53వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశా. ఎంత ఎక్కువ మెజార్టీతో గెలిపిస్తే అంత బలం వస్తుందని ఆనాడు చెప్పా. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోనే మూడో అత్యధిక 91వేల మెజార్టీతో గెలిపించారు. అదే స్థాయిలో ప్రపంచమంతా మంగళగిరి వైపు చూసే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు తీసుకున్న అని లోకేష్ పేర్కొన్నారు.

**నేతలు ప్రజల మనస్సు గెలుచుకోవాలి..** మంగళగిరి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. నియోజకవర్గ అభివృద్ధికి ఐదేళ్లు అహర్నిశలు కష్టపడతా. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచేలా చూడాల్సిన బాధ్యత స్థానిక నాయకత్వానిదే. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి. ప్రజల మనస్సు గెలుచుకోవాల్సిన బాధ్యత ఇక్కడి నాయకులపై ఉంది. అహంకారం వీడాలి. అందరినీ కలుపుకొని పోవాలి. నియోజకవర్గ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి చెప్పారు.

## ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా గౌతమి శ్వేత కోట ప్రమాణ స్వీకారం



**మంగళగిరి,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా గౌతమి శ్వేత కోట సోమవారం ఉదయం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. మంగళగిరి సమీపంలోని చినకాకాని ఎంజీఎం క్యాపిటల్ బిల్డింగ్ (4వ అంతస్తు)లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో ఉదయం 11:25 నిమిషాలకు ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ సమక్షంలో ఆమె అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

## అవినీతి రహిత రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములుకండి

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- 1064 టోల్‌ఫ్రీ నంబరు ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ



**విజయవాడ,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** అవినీతి రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. అవినీతిని అరికట్టేందుకు ప్రజల్లో చైతన్యం కల్పించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతను ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో అవినీతి నిరోధక శాఖ రూపొందించిన ప్రత్యేక ప్రచార పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అవినీతికి సంబంధించిన ఫిర్యాదుల కోసం 1064 టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రజలు వినియోగించుకోవాలని, అవినీతి నిర్మూలనకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాట్సాప్ నంబరు (94404 40057), complaints-acb@ap.gov.in కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం అందేలా ప్రతి శాఖలో అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెంపొందించేందుకు అవినీతి నిరోధక చర్యలు, ప్రజల్లో చైతన్యం కీలకమని తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి, నిజాయితీతో కూడిన పాలనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ బీవీ సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యత్వ కార్డు అందుకున్న బొబ్బ నవత రెడ్డి



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యత్వ కార్డును అడ్వకేట్,మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతా రెడ్డి అందుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్వకేట్ గోవర్ధన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ అడ్వకేట్ సురేందర్ గౌడ్ చేతుల మీదుగా ఆమె సభ్యత్వ కార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యత్వ కార్డు అందుకోవడం పట్ల న్యాయవాదులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. న్యాయ-వాద వృత్తిలో సభ్యత్వం కీలకమైన భాగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చిందం శ్రీకాంత్ యాదవ్, శివ, వంశీ, వరలక్ష్మి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# అర్నబ్ తుపాను ముప్పు.. జిల్లా యంత్రాంగం అప్రమత్తం

● 27, 28 తేదీల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ● 89 వేల మంది తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశాం.. 101 పునరావాస కేంద్రాలు సిద్ధం ● కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడి



**కాకినాడ, అక్టోబర్ 26 (వార్తాప్రభ) :**అర్నబ్ తుపాను ముప్పు నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో అప్రమత్తం చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ప్రజల ప్రాణరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామని వెల్లడించారు. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టిన చర్యలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, అత్యవసర సేవల నిర్వహణ తదితర అంశాలపై సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. ప్రస్తుతం తీవ్ర వాయుగుండంగా ఉన్న వాతావరణ వ్యవస్థ తుపానుగా, తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని, ఈ నెల 28వ తేదీ ఉదయం తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

**89 వేల మంది తీర ప్రాంత ప్రజలకు హెచ్చరికలు..** జిల్లాలోని తీర ప్రాంత గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో సుమారు 89 వేల మంది నివసిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. తుపాను ముప్పుపై వారందరికీ ముందస్తు సమాచారం అందించి అప్రమత్తం చేస్తున్నామన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జిల్లావ్యాప్తంగా 101 పునరావాస కేంద్రాలను గుర్తించామని వెల్లడించారు. ఆరు తీర ప్రాంత మండలాలతోపాటు మరో ఐదు మండలాల్లోనూ అవసరమైన ఏర్పాట్లు చేపట్టామన్నారు. తీర ప్రాంత గ్రామాల ప్రజలను ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నంలోపు పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో భోజనం, తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించామన్నారు.

**4559 బోట్లు సురక్షిత ప్రాంతాలకు చేరిక..** తుపాను ముప్పు నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లవద్దని కలెక్టర్ సూచించారు. జిల్లాలో మొత్తం 4,602 బోట్లు ఉండగా, వాటిలో 4,559 బోట్లు హార్బర్లు, వివిధ ల్యాండింగ్ కేంద్రాలకు సురక్షితంగా చేరుకున్నాయని తెలిపారు. మిగిలిన 43 బోట్లు పారదీప్ తదితర హార్బర్లలో ఉన్నట్లు వెల్లడించారు. మత్స్యకారుల భద్రతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

**ఆసుపత్రులు, తాగునీటి పథకాలకు విద్యుత్ బ్యాకప్..** తుపాను సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినా అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా అన్ని ఆసుపత్రుల్లో, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)లో విద్యుత్ బ్యాకప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని తాగునీటి పథకాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందుబాటులో ఉంచాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించామన్నారు. విద్యుత్ స్తంభాలు కూలిపోయిన సందర్భాల్లో తక్షణమే మరమ్మతులు చేపట్టేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేశామన్నారు. అవసరమైన స్తంభాలు, ఇతర సామగ్రిని ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. చెట్లు కూలి రహదారులపై రాకపోకలకు అంతరాయం కలగకుండా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, తహసీల్దార్ల సమన్వయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. అవసరమైన చోట్ల జేసీబీలు, పవర్ రంపాలు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో డ్రైనేజీలను ముందుగానే శుభ్రం చేయించి, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు వెల్లడించారు.

**ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం..** తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని, ఒక ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. అత్యవసర సేవలకు ఇంధన కొరత రాకుండా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. వ్యవసాయ, సాగునీటి శాఖల అధికారులు రిజర్వాయర్లలో నీటి మట్టాలు, వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**రెండు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు..** తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 28వ తేదీ సాయంత్రం వరకు అత్యవసర పరిస్థితులు మినహా ప్రయాణాలను నివారించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టార్చ్‌లైట్లను ముందుగానే ఛార్జింగ్ చేసుకోవాలని, రెండు మూడు రోజులకు సరిపడా ఆహారం, తాగునీరు, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డులు, విద్యార్హత ధ్రువపత్రాలు వంటి ముఖ్యమైన పత్రాలను తడవకుండా భద్రపరచుకోవాలన్నారు. ఇళ్ల చుట్టూ గాలికి ఎగిరిపోయే వస్తువులు, పాత రేకులు ఉంటే తొలగించాలని లేదా గట్టిగా కట్టిపెట్టాలని సూచించారు. వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అధికారుల సూచనలను పాటించాలని కోరారు. తీర ప్రాంత ప్రజలు అవసరమైనప్పుడు ఆలస్యం చేయకుండా పునరావాస కేంద్రాలకు వెళ్లాలని తెలిపారు.

**జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు..** తుపాను ప్రభావిత ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు జిల్లా, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ల్యాండ్‌లైన్: 0884-2356801- మొబైల్: 9849903879 నెంబర్లకు ఫోన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి అందే సమాచారంపై అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు. తుపాను సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండటంతోపాటు అధికారులకు సహకరించాలని, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు.

## టిడిపికి నరసాపురం కంచుకోట టిడిపి సీనియర్ నాయకులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు





**విస్సన్నపేట,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని నరసాపురం గ్రామంలో టిడిపి గెలుపే లక్ష్యంగా ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు సూర్య లక్ష్మీనారాయణ స్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో వేద మంత్రోచ్చరణలతో నిర్వహించిన పూజలలో నరసాపురం ఎంపీటీసీ అభ్యర్థిని ఉమ్మడి భాగ్యశ్రీ రాంబాబు దంపతులు టిడిపి గ్రామ పెద్దలు పాల్గొన్నారు. వేద ఆశీర్వచనాలు అందుకున్న అనంతరం ప్రచార కార్యక్రమాలలో తెలుగింటి ఆడపడుచులు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్నారు. అభ్యర్థిని భాగ్యశ్రీ మాట్లాడుతూ నరసాపురం ఎంపీటీసీ అభ్యర్థినిగా తనకు జడ్పిటిసి అభ్యర్థినిగా మట్టా సుజాతకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## గడపగడపకు వైసీపీ ప్రచారం





**విస్సన్నపేట,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో ఏ కొండూరు రోడ్డు బీసీ కాలనీ వైసిపి జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ సిసాని ప్రకాష్ ఇంటి వద్ద నుండి గెలుపే లక్ష్యంగా వైసీపీ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. జడ్పిటిసి అభ్యర్థిని గామాసు రాధ పోటీ చేస్తున్నారని విస్సన్నపేట సెగ్మెంట్ ఒకటి చెరుకు సుజాత, సెగ్మెంట్ 2 రెడ్డి లక్ష్మీ నటరాజ్, మూడు దస్తగిరి, నాలుగు పిల్లి రాజేష్, ఐదు గంజినబోయిన సీతారామయ్య, ఆరు గద్దల మల్లయ్య ఎంపీటీసీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అఖండ మెజార్టీ అందించాలని విజ్ఞప్తి చేశారు. మండల వైసిపి అధ్యక్షులు ఓలేటి దుర్గారావు జిల్లా మండల గ్రామ నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు పాల్గొన్నారు.

## ఎస్సీ/ఎస్టీ రిజర్వు స్థానాల అభ్యర్థుల అర్హతల ధృవీకరణ పటిష్ఠం చేయాలి వి హెచ్ పి



**మచిలీపట్నం,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ/ఎస్టీ రిజర్వు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల అర్హతల ధృవీకరణ ప్రక్రియను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా రూపొందించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా సమర్పించిన వినతిపత్రంపై తక్షణ చర్యలు తీసుకోవాలని వి హెచ్ పి ప్రతినిధి బృందం సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి ను కలిసి విజ్ఞప్తి చేసింది. ఈ ప్రతినిధి బృందంలో కృష్ణా జిల్లా కార్యాలయ ప్రముఖ్ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి వర్రె రాజశేఖర్ పాల్గొన్నారు. ఎస్సీ/ఎస్టీ రిజర్వు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల అర్హతల ధృవీకరణలో పారదర్శకత విశ్వసనీయతకు ఉన్న ప్రాధాన్యతను, ఈ అంశంలోని తీవ్రతను డి ఆర్ ఓ కి వివరించారు. ఈ అంశంపై వి హెచ్ పి కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ సమర్పించిన వినతిపత్రం రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపబడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ/ఎస్టీ రిజర్వు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల అర్హతలను నిబంధనలకు అనుగుణంగా ధృవీకరించేందుకు మరింత పటిష్ఠమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరాన్ని ఈ వినతిపత్రం ప్రధానంగా ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో, వినతిపత్రంలోని అంశాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, దానిని అత్యవసరంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించి తగిన పరిశీలనకు అవకాశం కల్పించాలని వి హెచ్ పి ప్రతినిధి బృందం డి ఆర్ ఓ ను కోరింది. నామినేషన్ సమయంలో నిర్దేశిత అఫిడవిట్లు సమర్పించడం, కుల ధృవపత్రాల ప్రామాణికతను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించడం, విశ్వసనీయమైన ఫిర్యాదులపై నిష్పక్షపాత విచారణ జరపడం వంటి రక్షణ చర్యలను అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని వినతిపత్రంలో కోరారు. తప్పుడు సమాచారం లేదా నకిలీ ధృవపత్రాలు సమర్పించినట్లు నిర్ధారణ అయిన సందర్భాల్లో చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో ప్రతి అభ్యర్థి హక్కులు, సహజ న్యాయ సూత్రాలు పరిరక్షించబడాలని స్పష్టం చేసింది.

## చింతల వెంకట శివ అప్పారావు, బేవర భారతికి మద్దతుగా ప్రచారం



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బాపులపాడు మండలంలో కూటమి బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ అభ్యర్థి చింతల వెంకట శివ అప్పారావు, బాపులపాడు-4 ఎంపీటీసీ అభ్యర్థి బేవర భారతి తరఫున ఆయన ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలను కలుసుకుంటూ అభ్యర్థుల గురించి వివరించారు. ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని ఓటర్లను కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దయాల రాజేశ్వర రావు, హనుమాన్ జంక్షన్ పట్టణ జనసేన అధ్యక్షుడు షేక్ అహ్మద్, బాపులపాడు గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు, తెలుగు మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

## 2వ సెగ్మెంట్ లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు జోరుగా ప్రచారం...



**పెనుగంచిప్రోలు,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని 2వ సెగ్మెంట్ లో జోరుగా ప్రచారం కొనసాగుతుంది. పెనుగంచిప్రోలు మండలం తెలుగుదేశం పార్టీ జడ్పిటిసి అభ్యర్థి జిల్లేపల్లి సుధీర్ బాబు, ఎంపీటీసీ అభ్యర్థి మాదినేని విక్రమ్ పెనుగంచిప్రోలు గ్రామంలోని బోసుపేట నుంచి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు, అనంతరం 2వ సెగ్మెంట్ లో నాయకులందరూ పాల్గొని ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు,ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య, శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయచైర్మన్ చుంచు రమేష్ బాబు మాజీ చైర్మన్లు నూతల పాటి చెన్న కేశవరావు కాకాని శ్రీనివాసరరావు, సొసైటీ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, మాదల శ్రీనివాసరరావు, కార్యదర్శి బోళ్ల రవికుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్కుమార్ , నల్లపు నేని జ్యోతి, సూర్య కుమారి ముళ్లపాటి ప్రసాద్ మాస్టర్, లగడపాటి ప్రవీణ్, లగడపాటి వినయ్ షేక్ మహమ్మద్ అజాద్,బొర్రా రమేష్,సొసైటీ డై రెక్టర్ కనపర్తి శ్రీనివాసరరావు ముళ్లగిరి రాంబాబు,ముళ్లపాటి రాము, జిల్లేపల్లి ప్రభాకారరావు పంగా వే శీ కయ్య మరియు గ్రామ తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అబ్దుల్ అబీదాకు కాపునాడు మద్దతు

● మేయర్ గా అబీదాను గెలిపించుకుంటాం ● కూటమి కార్పొరేటర్ అభ్యర్థుల గెలుపులో భాగస్వాములవుతాం ● కాపునాడు మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షులు వడ్లమూడి చిన్న



**మచిలీపట్నం,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** మచిలీపట్నం మేయర్ స్థానానికి పోటీ చేస్తున్న కూటమి బలపర్చిన టీడీపీ అభ్యర్థి అబ్దుల్ అబీదాకు కాపునాడు మద్దతు తెలిపింది. నగర మేయర్ గా అబ్దుల్ అబీదాను, కార్పొరేటర్లుగా పోటీ చేస్తున్న 60 డివిజన్ల కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటామని కాపునాడు మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షులు వడ్లమూడి వీరాంజనేయులు (చిన్న) తెలిపారు. చిన్న అధ్యక్షతన సోమవారం కాపునాడు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదాను స్వాగతించి తమ మద్దతు తెలియజేశారు. నవంబర్ 1న జరిగే నగర పాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కాపునాడు సంఘీయులకు పిలుపునిచ్చారు. కులమతాలకు అతీతంగా కూటమి అభ్యర్థులను బలపర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మచిలీపట్నం స్థితిగతులు మారాయన్నారు. అధ్వాన్నంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ ఇతోధికంగా కృషి చేస్తున్నారన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ టీడీపీ అభ్యర్థి హసీం బేగ్, కాపునాడు ప్రతినిధులు నరహరశెట్టి హరికృష్ణ, కూనపరెడ్డి బ్రహ్మయ్య, కూనపరెడ్డి శ్రీనివాసరావు, పంచకర్ల మూర్తి, రాయగిరి శ్రీరామ్, నిడదవోలు శ్రీనివాసరావు, కనపర్తి వెంకటేశ్వరరావు, ముదినేని కొండా, కొత్తపల్లి వేణు మాధవ్, ఐ. రామారావు, కూనపురెడ్డి సుబ్బారావు, పొన్నూరి శ్రీనివాస్, వేమూరి మురళి తదితరులు పాల్గున్నారు.

## వాల్మీకి రామాయణం మానవాళికి ఆదర్శం

- సుంకర సాంబశివ రాయల్




**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కానుమోలు గ్రామంలోని గ్రంథాలయంలో రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాణా వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర సాంబశివ రాయల్ మాట్లాడుతూ, భారతీయ సాహిత్యానికి మహర్షి వాల్మీకి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆదికవి వాల్మీకి రచించిన రామాయణం మానవాళికి ధర్మం, సత్యం, న్యాయం, కరుణ, నైతిక విలువలను బోధించే మహోన్నత గ్రంథమని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన బోధనలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువత వాల్మీకి మహర్షి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని నైతిక విలువలు, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. మహర్షి వాల్మీకి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు విద్యా వికాసం, సాంస్కృతిక చైతన్యం, సామాజిక సేవలను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాణా వెల్ఫేర్ సొసైటీ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని సుంకర సాంబశివ రాయల్ తెలిపారు.

## మండలం లోని 21 పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్.ఐ. అర్జున్



**పెనుగంచిప్రోలు,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లో 3 వ తేదీ జరగబోవు ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు దృష్ట్యా...పెనుగంచిప్రోలు మండలం లోగల పోలింగ్ స్టేషన్స్ మరియు పోలింగ్ బూత్ లను ఎస్ ఐ అర్జున్ సోమవారం పరిశీలించి అక్కడ గల భద్రత చర్యలు చూడటం జరిగింది.అదేవిధంగా హైపర్ సెన్సిటివ్.. మరియు సెన్సిటివ్ గ్రామాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడమైనదని ఎస్ ఐ అర్జున్ తెలిపారు..

## కూటమి పార్టీతోనే అభివృద్ధి రూపేష్ కుమార్

● కూటమి నాయకులతో ప్రచారం ● ఛైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్‌తో కలిసి15,16 వార్డుల్లో ఇంటింటి ప్రచారం.. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి



**అమలాపురం,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంమున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. ఈ నేపథ్యంలో 15వ వార్డు ఎన్డీఏ కూటమి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దండుమోను రూపేష్ కుమార్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. వార్డులోని ప్రజలను నేరుగా కలుసుకుంటూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్‌తో కలిసి 15వ 16వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులకు ప్రజలు తమ అమూల్యమైన ఓటును వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రూపేష్ కుమార్ మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో మున్సిపల్ వార్డుల్లో మౌలిక సదుపాయాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ వంటి ప్రజల నిత్యజీవితానికి సంబంధించిన సమస్యలను పట్టించుకోకపోవడంతో వార్డుల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డుల అభివృద్ధిని పక్కనపెట్టి ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. తాను ఎన్నికల్లో విజయం సాధిస్తే 15వ వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని రూపేష్ కుమార్ హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికీ మెరుగైన మంచినీటి సరఫరా అందేలా కృషి చేయడంతో పాటు, పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడం, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం, వీధి దీపాల సౌకర్యాలను కల్పించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వార్డును పరిశుభ్రంగా, అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని, వార్డులో అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా పనిచేస్తానని రూపేష్ కుమార్ స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థుల విజయంతోనే వార్డుల అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందని పేర్కొంటూ, 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి దండుమోను రూపేష్ కుమార్‌కు లిసైకిల్ గుర్తుపై, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్‌కు లిలిగాజు గ్లాసు గుర్తుపైలి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇంటింటి ప్రచారం ద్వారా ఓటర్లను కలుసుకుంటూ ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో దండుమేను రూపేష్, చిట్టిమేను దత్తాత్రేయులు, దండుమేను అన్నవరం, కోరశిఖ చంటి, చిట్టిమేను సత్తిబాబు, మందపాటి వాసు, కైలా శోభన్ బాబు, కానుబోయిన భాస్కర్, లోవ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు

## టీడీపీ సీనియర్ నాయకులు ఉమ్మినేని నరసింహారావు కు ఘన నివాళ్లులు



**పెనుగంచిప్రోలు,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని ముండ్లపాడు మాజీ పీఏసీఎస్ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మినేని నరసింహారావు ఆదివారం మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్ వారి నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుమారుడు, ముండ్లపాడు పీఏసీఎస్ ఛైర్మన్ ఉమ్మినేని పుల్లారావు మరియు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉమ్మినేని నరసింహారావు మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.

## క్రైస్తవ కార్పొరేషన్ లో సబ్సిడీ రుణాలను మహిళలు సద్వినియోగించుకోవాలి.

**- రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ దీపక్ జాన్..**
**హరిపిరాల సిఎస్ఐ చర్చిలో ఘనంగా స్త్రీల మైత్రి పండుగ..**





**తొర్రూరు అక్టోబర్ 26 (వార్తాప్రభ):** క్రైస్తవ కార్పొరేషన్ లో అంద జేస్తున్న సబ్సిడీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని అన్ని రంగాలలో ముందుండాలని తెలంగా ణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం హరిపిరాల గ్రామం లోని సిఎస్ఐ చర్చిలో తలారి అశోక్ ఆధ్వర్యంలో స్త్రీల మైత్రి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రిస్టియన్లు మైనారిటీలకు ప్రభుత్వం అందజేస్తున్న రుణాలు ప్రతి ఒక్కరికి అందాలనే సదుద్దేశంతో నన్ను చైర్మన్ గా నియమించారని అన్నారు. క్రైస్తవ కార్పొరేషన్ ద్వారా మహిళలకు అందజేసే సబ్సిడీ రుణాలలో ఎలక్ట్రికల్ స్కూటీలు కుట్టు మిషన్ లు అందజేయడం జరుగుతుందని అర్హులైన క్రిస్టియన్ మహిళలు అప్లై చేసుకుని సద్వినియోగించుకోవాలని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలు అభివృద్ధి చెందాలని జడ సంకల్పంతో ఇలాంటి సబ్సిడీ రుణాలను అందజేస్తుందని తెలిపారు. అనంతరం మహిళలందరూ క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ ను సన్మానించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ దీపక్ జాన్ మహిళలందరికీ మైత్రి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ గ్రూప్ చైర్మన్ కాంతారావు, శేఖర్, రాజు, గ్రామ సర్పంచ్ చెంచర్ల స్వాతి రాజు, డోర్నకల్ ముఖ్య నాయకులు బి.జీ క్లెమెంట్, మోజస్ మనోహర్, కనపర్తి సంజీవ, క్రీస్తు దాసు, గ్రామ ఉపసర్పంచ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్‌డన్ లాండ్రోమాట్ ప్రారంభం

**పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.**



**ఎల్బీనగర్/వార్తప్రభ(అక్టోబర్ 26):** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని షిరిడి నగర్ కాలనీలో 'ఆల్‌డన్ లాండ్రోమాట్ -- డ్రై క్లీనింగ్ ఒ ఫినిషింగ్ సర్వీసెస్' నూతన కేంద్రం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ కార్పొటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, సంస్థ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా ఇటువంటి నూతన వ్యాపారాలు రావడం వల్ల ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందుబాటులోకి రావడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేత

**18 మంది అభ్యర్థులకు బి-ఫారాలు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే మేకా..**



**ఆగిరిపల్లి, అక్టోబర్ 26 (వార్తా ప్రభ దినపత్రిక):** ఆగిరిపల్లి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహాలను ముమ్మరం చేసింది. సోమవారం తోటపల్లి గ్రామంలో వైసీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు నివాసంలో మండలానికి చెందిన 18 మంది ఎంపీటీసీ అభ్యర్థులకు నూజివీడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట్ ప్రతాప్ అప్పారావు పార్టీ బీ-ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి అభ్యర్థి విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆగిరిపల్లి మండలంలో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను పార్టీ కైవసం చేసుకునే లక్ష్యంతో ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించిన ఆయన, మండలంలోని కొండలు, గుట్టల తవ్వకాలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బియ్యం ధరలు కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు పెరిగాయని పేర్కొంటూ, ప్రజల ఆర్థిక పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించి ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టిన అభ్యర్థులు గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జడ్పిటిసి సభ్యురాలు పావన జ్యోతి, ఎంపీటీసీ, ఎంపీపీ అభ్యర్థి బెజవాడ రాంబాబు, ఎంపీటీసీ అభ్యర్థులు నాయకులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కూకట్ పల్లి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యత్వ కార్డు అందుకున్న బొబ్బ నవత రెడ్డి



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 26 (వార్తాప్రభ):** కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యత్వ కార్డును అడ్వకేట్,మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతా రెడ్డి అందుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్వకేట్ గోవర్ధన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ అడ్వకేట్ సురేందర్ గౌడ్ చేతుల మీదుగా ఆమె సభ్యత్వ కార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యత్వ కార్డు అందుకోవడం పట్ల న్యాయవాదులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాద వృత్తిలో సభ్యత్వం కీలకమైన భాగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చిందం శ్రీకాంత్ యాదవ్, శివ, వంశీ, వరలక్ష్మి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ వేడుకల పేరుతో వసూళ్ల పర్వమా?

- ఉద్యోగులపై ఆర్థిక భారం మోపుతున్నారనే ఆరోపణలు!
- హోదా అండగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారా?
- విద్యాశాఖ ఉన్నతాధికారులు మేల్కొనేదెప్పుడు?



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఉద్యోగులకు గౌరవప్రదమైన వీడ్కోలు పలకాల్సిన రిటైర్మెంట్ వేడుకలు.. కొందరి వ్యవహారశైలితో వసూళ్ల కార్యక్రమాలుగా మారుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఉద్యోగ విరమణ పేరుతో తోటి ఉద్యోగుల నుంచి డబ్బులు, విలువైన బహుమతులు సేకరించేందుకు ఒత్తిడి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ఇది సంప్రదాయమా? లేక అధికార హోదాను అడ్డం పెట్టుకుని సాగిస్తున్న వ్యవహారమా? అన్న ప్రశ్నలు ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

**ఉద్యోగుల జేబులకు చిల్లు పెట్టడమేనా?** రిటైర్మెంట్ వేడుక నిర్వహించుకోవడం వ్యక్తిగత నిర్ణయం కావాలి. కానీ ఆ వేడుకల ఖర్చుల పేరుతో ఇతర ఉద్యోగులపై ఆర్థిక భారం మోపడం ఎంతవరకు సమంజసం? ఇవ్వాలనుకునే వారు స్వచ్ఛందంగా ఇచ్చే బహుమతులు వేరు.. ఇవ్వక తప్పని పరిస్థితులు కల్పించడం వేరు. ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు నిజమైతే, అది ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగానే పరిగణించాల్సి ఉంటుంది.

**హోదా ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారా?** ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థలో ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడి పనిచేయాల్సిందే. అధికార హోదా ఉన్నంత మాత్రాన ఇతరులపై ఒత్తిడి చేసే హక్కు ఎవరికీ లేదు. వేడుకల పేరుతో సేకరిస్తున్న మొత్తాలు ఎంత? ఎవరెవరి నుంచి వసూలు చేస్తున్నారు? డబ్బులు ఇవ్వని ఉద్యోగులపై ఏమైనా ఒత్తిళ్లు తెస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**ఉన్నతాధికారుల మౌనం ఎందుకు?** విద్యాశాఖలో ఇలాంటి ఆరోపణలు వినిపిస్తున్నప్పుడు సంబంధిత అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం సరికాదు. ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలి. ఉద్యోగులపై అనధికారిక ఒత్తిళ్లు ఉన్నట్లు తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు తమ సమస్యలను నిర్భయంగా వెల్లడించే వాతావరణాన్ని కల్పించాలి.

**వేడుకల పేరుతో వసూళ్లకు అడ్డుకట్ట వేయాలి!** ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థలో పారదర్శకత, క్రమశిక్షణ, పరస్పర గౌరవం ఉండాలి. ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించి వారిపైనే ఆర్థిక భారం మోపుతున్నారనే ఆరోపణలను తేలిగ్గా తీసుకోకూడదు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలి. వేడుకలు గౌరవానికి ప్రతీకలుగా ఉండాలి.. ఉద్యోగుల జేబులకు భారంగా మారకూడదు! హోదా ఏదైనా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవనే స్పష్టమైన సందేశం ఇవ్వాలి.

## చదువుతో పాటు విషయ పరిజ్ఞానం పెరగాలి!

- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై కలెక్టర్ అంకిత్ ప్రత్యేక దృష్టి
- పాఠశాల తనిఖీలో విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లోని పాఠాలను చదవడమే కాకుండా, వాటిలోని విషయాలను పూర్తిగా అర్థం చేసుకుని సొంత మాటల్లో వివరించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించి, విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. తనిఖీలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివరాలతో పాటు తరగతి గదుల నిర్వహణ, పాఠశాల పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. పండుగ సెలవుల అనంతరం విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలని సూచించారు. అనంతరం ఎనిమిదో తరగతి ఏ, బీ సెక్షన్లలో విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి చదివే సామర్థ్యాన్ని, పాఠ్యాంశాలపై అవగాహనను పరీక్షించారు. కొంతమంది విద్యార్థులు ఆంగ్ల పాఠ్యాంశాలను చదవడంలో, వాటి భావాన్ని వివరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. దీంతో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ అందించాలని సంబంధిత ఉపాధ్యాయుడికి సూచించారు.

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి** ఎనిమిదో తరగతి ఏ సెక్షన్‌లో భౌతికశాస్త్ర పాఠం జరుగుతున్న సమయంలో విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించారు. ప్రతి విద్యార్థికి పాఠ్యాంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించేలా బోధనా పద్ధతులను మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, వెనుకబడిన వారికి అవసరమైన ప్రత్యేక తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మూర్తితో మాట్లాడిన కలెక్టర్, విద్యార్థుల్లో చదవడం, అర్థం చేసుకోవడం, విశ్లేషించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం వంటి నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. మెరుగైన విద్యా ఫలితాల సాధనకు ఉపాధ్యాయులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పాఠశాల భవన సముదాయం, సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ల్యాబ్‌కు ప్రవేశ మార్గం, మెట్ల నిర్మాణ ప్రతిపాదనలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కారంలో వేగం పెంచాలి.

**శాఖల వారీగా బ్యాక్ లాక్ వేకెన్సీల నివేదికను వెంటనే సమర్పించాలి.**
**-జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్.**



**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 26 (వార్తాప్రభ):** ప్రజావాణిలో ప్రజలు అందజేసిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కారంలో వేగం పెంచాలని.. శాఖల వారీగా బ్యాక్లాగ్ వీకన్సి ల నివేదికను వెంటనే సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రెవెన్యూ కె అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్ఓ నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలిసి లిజిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజావాణి కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి వేగంగా పరిష్కరించాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని విభాగాలకు సంబంధించి బ్యాక్లాగ్ వేకెన్సీ ల వివరాలను తక్షణమే నివేదికను అందించాలని, సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎల్ ని నో కారణంగా జిల్లా వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, వసతి గృహాల నిర్వహణ, కార్యాలయ విధుల ముఖచిత్రం హాజరు, శాఖల పరిధిలో పెండింగ్లో ఉన్న అన్ని పనులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. సోమవారం వివిధ మండలాల నుండి జిల్లా,డివిజన్, మండలాల వారీగా మొత్తం (134) దరఖాస్తులు వచ్చాయి. నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామానికి చెందిన ఇసంపెల్లి రమేష్ తాను ఒంటరిగా ఉంటూ పూరి గుడిసెలో నివసిస్తున్నానని తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని కోరారు. సీరోలు మండలం మన్యగూడెం తాల్య తండకు చెందిన భీమా ఎన్నో ఏళ్లుగా తాము సాగుచేసుకుంటున్న భూమి వేరే ఇతర వ్యక్తులపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని విచారణ చేసి మా యొక్క భూమిని మా పేరుపై రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వగలరని కోరారు. తెలంగాణ రాష్ట్ర దళిత బంధు సాధన సమితి దళితబంధు బాధితులు తమ ఎకౌంట్లలో రెండో విడత దళితబంధు డబ్బులు 2 లక్షల రూపాయలను జమచేయాలని కోరారు. డోర్నకల్ మండలం గుర్రాల కుంట గ్రామానికి చెందిన ఇస్లావత్ మాన్ సింగ్ తమకు పూర్వీకుల నుండి సంక్రమించిన భూమిని అధికారులు వేరేవారికి పట్టా చేస్తారని చెపుతున్నారని పట్టాపాసు పుస్తకాల ప్రకారం తమకు ఉన్న భూమిని వేరే ఇతర వ్యక్తులకు పట్టా చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో న్యాయ సేవ సంస్థ ప్రతినిధి, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపర్డెంట్లు, పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

**ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ధీమా వ్యక్తం చేశారు. సోమవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి పట్టభద్రులను గుర్తించి, ఎన్నికల సంఘం విడుదల చేసిన ఫారం-18 ద్వారా నవంబర్ 6లోగా ఓటర్లుగా నమోదు చేయించాలని కోరారు. నమోదు చేసిన వివరాలను పార్టీ యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పార్టీ కోసం క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేసే వారికే పదవులు లభిస్తాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పార్టీ నాయకుడు రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలి.

**-తొర్రూరు మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్.**



**తొర్రూరు అక్టోబర్ 26 (వార్తాప్రభ):** బాల వికాస చేపట్టే సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలని తొర్రూరు మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో సోమవారం బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు,అనాథలకు దాతల సాయంతో సమకూర్చిన నిత్యవసర సరుకులు,దుస్తులు, బెడ్ షీట్లు పంపిణీ చేశారు. బాలవికాస సెంటర్ మేనేజర్ వై. రమ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బాల వికాస మహిళా ప్రోగ్రాం మేనేజింగ్ డైరెక్టర్ లతా ప్రతాప్,వైస్ చైర్మన్ రజిని రాజశేఖర్ లు మాట్లాడుతూ సమాజంలో నిస్సహాయులను, అనాథలను, వృద్ధులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. ప్రస్తుత కాలంలో మానవతా విలువలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కష్టాల్లో ఉన్న తోటి మానవులకు సహాయం చేయడం ద్వారానే నిజమైన మానవత్వం సిద్ధిస్తుంది. ప్రతి ఒక్కరూ తమకు తోచిన రీతిలో నిస్సహాయులకు అండగా నిలవాలన్నారు.

## కొత్తగూడెంలో ఎక్సైజ్ వాహనాల బహిరంగ వేలం

**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి):** వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 27న మంగళవారం ఉదయం 11 గంటలకు కొత్తగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వి. రాజశేఖర్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్, ఖమ్మం ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఈ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే ఆసక్తి గలవారు 50 శాతం డిపాజిట్ చెల్లించాలని సూచించారు. వాహనాలు కొనుగోలు చేయదలచిన వారు ఆధార్ కార్డు, పాన్ కార్డుతో వేలం జరిగే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు హాజరుకావాలని సీఐ రాజశేఖర్ తెలిపారు.

## జవహర్ నగర్ అభివృద్ధికి రూ.35 కోట్ల నిధులు..

**పనులు త్వరితగతిన ప్రారంభించాలని ఎం ఎం సి కమిషనర్‌ను కోరిన మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్.**



**జవహర్ నగర్, అక్టోబర్ 26(వార్తా ప్రభ):** కీసర సర్కిల్‌జవహర్ నగర్ డివిజన్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో రూ.35 కోట్ల అభివృద్ధి నిధులను మంజూరు చేయించడంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ కీలక పాత్ర పోషించారు. మంజూరైన నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని జవహర్ నగర్ మాజీ మేయర్, డివిజన్-3 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ని కోరారు. ఈ సందర్భంగా మంజూరైన నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను వీలైనంత త్వరగా జారీ చేసి, పనులకు వర్క్ ఆర్డర్లు అందజేసి అభివృద్ధి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎం ఎం సి కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి పనులను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. రూ.35 కోట్ల నిధులతో జవహర్ నగర్ డివిజన్‌లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం కానుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జవహర్ నగర్ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, సత్యం వంశరాజ్, జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, గజ్వేల్ శంకర్, మాజీ కార్పొరేటర్ శ్రీమతి ప్రేమల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. జవహర్ నగర్ అభివృద్ధికి సహకరిస్తున్న గౌరవ ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి, రూ.35 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన తోటకూర వజ్రేష్ యాదవ్ కి, పనులు వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్న ఎం ఎం సి కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి కి నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



**హైదరాబాద్ :అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ మల్లికార్జున నగర్ బస్ స్టాప్ వద్దన ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బండారి రవి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి డివిజన్ అధ్యక్షులు ఈసం రాకేష్ , మల్కాజ్ గిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్ , మాజీ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్, బాలసుబ్రమణ్యం , వెంకట్ కిషోర్ , అమర్ ,గౌతమ్, గణేష్ యాదవ్ , గోపి, యాదగిరి, రాజేష్ , చారి, కృష్ణమూర్తి, సాగర్ నీలేష్ ,వినోద్ పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మన్ కీ బాత్ లోనూ మోడీ రికార్డు

ప్రధాని నరేంద్ర మోడీ అంటే ఎన్నో రికార్డులు వెంటనే గుర్తుకు వస్తాయి. ఆయన ఇటీవలనే పాతికేళ్ళ అధికార జీవితాన్ని పూర్తి చేసుకున్నారు. అందులో 13 ఏళ్ళు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటే 12 ఏళ్ళ నుంచి దేశానికి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఆయన గుజరాత్ కి కంటిన్యూస్ సీఎం. అంతే కాదు లాంగెస్ట్ సీఎం. అదే విధంగా దేశంలో నెహ్రూ తరువాత వరుసగా మూడు సార్లు ప్రధాని అయిన ఘనత మోడీదే. ఇక ఈ టెర్మ్ పూర్తి చేసుకుంటే ఇందిరమ్మ ప్రధానిగా పదవీ కాలాన్ని సమం చేస్తారు. ఎమ్మెల్యే కాకుండా ఎక్కడా పోటీ చేయకుండా గుజరాత్ సీఎం కావడం ఒక హిస్టరీ అయితే జాతీయ రాజకీయాల్లోకి వస్తూనే నేరుగా ప్రధాని కావడం మరో రికార్డు. తొలిసారి ఎంపీ అదే టెర్మ్ లో పీఎం ఇలా మోడీ పొలిటికల్ ట్రాక్ రికార్డు ఉంది. రేడియో ప్రయాణంలోనూ : ఇదిలా ఉంటే మోడీ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమం ద్వారా ఈ ఆదివారం ప్రసారంతో 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. దాంతో ఇందులో కూడా మోడీ కొత్త బెంచ్ మార్క్ క్రియేట్ చేసారు అని అంటున్నారు. పన్నెండేళ్ల క్రితం 2014 అక్టోబర్ 3న విజయదశమి పర్వదినాన మోడీ రేడియో మాధ్యమంగా చేసుకుని మన్ కీ బాత్ పేరుతో వినూత్న కార్యక్రమం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతీ నెలా చివరి ఆఖరి వారం ఆయన ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో ముచ్చటిస్తారు. ఆ నెలలో దేశంలో జరిగే కార్యక్రమాలు అభివృద్ధి, సంస్కృతి, పండుగలు, క్రీడలు, యువత, మహిళకు, వ్యవసాయం ఇలా అనేక అంశాలను ఆయన తీసుకుని చర్చిస్తారు. దేశంలో వివిధ ప్రాంతాల విశిష్టత గురించి కూడా ప్రస్తావిస్తారు. అలాగే దేశంలో మారుమూల ప్రాంతాలలో ఉన్న కళాకారులను కార్మికులను విద్యార్థులను, యువతను వృద్ధులను ఎవరి దగ్గర ప్రతిభ కష్టం ఉందో వారిని తన మన్ కీ బాత్ ద్వారా కొనియాడుతూ దేశ ప్రజలకు పరిచయం చేస్తారు. తన పన్నెండేళ్ల మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నరేంద్ర మోడీ ఒక తీర్ధ యాత్రగా అభివర్ణించడం విశేషం. ఇది నిరంతరాయంగా కొనసాగుతోందని అన్నారు. ఈ ప్రయాణంలో దేశ ప్రజలు అంతా తన సహ ప్రయాణికులుగా స్ఫూర్తిదాతలుగా ఆయన చెప్పుకొచ్చారు. శతాబ్దాలుగా దేశంలో తీర్థయాత్రల సంప్రదాయం ఉందని మోడీ చెబుతూ దేశ ప్రజల గురించి అర్థం చేసుకోవడానికి వారి సేవలను ప్రతిభను కృషిని తలచుకుని అభివందనం చేయడానికి మన్ కీ బాత్ తనకు ఒక తీర్థయాత్ర గా ఉపయోగపడింది అని ఆయన చెప్పారు. దేశంలో ఎన్నో ప్రసార సాధనాలు వచ్చాయి, వినోద మాధ్యమాలు వచ్చాయి. వాటి మధ్యన రేడియో వెనకబడింది. ఒకప్పుడు రేడియోవే అన్నింటికీ ఆధారం. అలాంటివి రేడియో ఊసే లేని కాలంలో మోడీ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా తిరిగి రేడియోకు ఎంతో ప్రాచుర్యం కల్పించారు అని చెబుతారు. దాంతో రేడియో మరోసారి జనంలోకి వచ్చింది. అలా ఆయన ఒక బలమైన మీడియం కి ఊపిరి పోశారు అని కూడా పేర్కొంటారు. అలాగే సమాజం దృష్టికి రాని ఎందరో మహానుభావులు అసాధారణమైన పనుల గురించి తాను ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తావించాను అని మోడీ గర్వంగా చెప్పుకున్నారు. మన్ కీ బాత్ ద్వారా దేశంలోని ప్రతీ కుటుంబంతో తనకు అనుబంధం అనుసంధానం ఏర్పడింది అని మోడీ చెప్పుకొచ్చారు.

## 34వ డివిజన్లో టిడిపి అభ్యర్థిని విజయలక్ష్మి ముమ్మర ప్రచారం



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26: (వార్త ప్రభ ప్రతినిధి)**స్థానిక 34 వ డివిజన్ అభివృద్ధి కోసం నగర పాలకు సంస్థ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి తనను గెలిపించాలని 34 వ డివిజన్ టిడిపి అభ్యర్థిని పొనుగుపాటి విజయలక్ష్మి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె 34 వ డివిజన్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ తనను కార్పొరేటర్ గా గెలిపిస్తే 34వ డివిజన్ ను మోడల్ డివిజన్ గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు . తెలుగుదేశం సీనియర్ నాయకులు పొనుగుపాటి చిన్న సుబ్బయ్య మాట్లాడుతూ నవంబర్ ఒకటో తేదీన జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి కార్పొరేటర్ గా తన కోడలు విజయలక్ష్మిని గెలిపించాలని కోరారు. అలాగే గాజు గ్లాస్ గుర్తుపై ఓట్లు వేసి మేయర్ అభ్యర్థి రాధాకృష్ణ ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 46వ డివిజన్ లో తుపాకుల శ్రీలక్ష్మి విస్తృత ప్రచారం



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26:(వార్త ప్రభ ప్రతినిధి)** స్థానిక 46వ డివిజన్ అభివృద్ధి కోసం నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను కార్పొరేటర్ గా గెలిపించాలని 46వ డివిజన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిని తుపాకుల శ్రీలక్ష్మి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు . సోమవారం ఆమె డివిజన్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా తుపాకుల శ్రీలక్ష్మి మాట్లాడుతు 46వ డివిజన్ ను మోడల్ డివిజన్ గా అభివృద్ధి చేసేందుకు గాను తనను కార్పొరేటర్ గా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రస్తుత కూటమి పాలనలో డివిజన్లో అభివృద్ధి ఏమాత్రం జరగలేదన్నారు. నవంబర్ 1వ తేదీన జరగనున్న ఎన్నికల్లో తనకు, వైసిపి మేయర్ అభ్యర్థిని రాయన భాగ్యలక్ష్మి కి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు తుపాకుల గురుమూర్తి రెడ్డి, వైసిపి డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డివిజన్ లో పారిశుధ్య సమస్యలను పరిష్కరిస్తా

**● ప్రతి ఇంటికి రక్షిత మంచి నీటి సరఫరా కి కృషి చేస్తా ● మీ మీ సమస్యలు నావిగా భావించి పరిష్కరిస్తా ● 46 వ డివిజన్ సీపీఐ అభ్యర్థి ని, ప్రముఖ లాయర్ బోను జయమ్మ**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26 :(వార్త ప్రభ ప్రతినిధి)**46వ డివిజన్ కొండ ప్రాంతంలో పారిశుధ్య సమస్యలు పరిష్కారం చెస్తానని అలాగే ప్రతి ఇంటికి రక్షిత మంచి నీటి సరఫరా కి కృషి చేస్తా అంటూ 46 వ డివిజన్ లో సీపీఐ అభ్యర్థిని గా ఎన్నికల బరిలో దిగిన ప్రముఖ లాయర్ బోను జయమ్మ స్థానికులని అభ్యర్థిస్తున్నారు. సీపీఎమ్ కాంగ్రెస్ పార్టీలు బలపరుస్తున్న బోను జయమ్మ తనకి కంకి కొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించండని సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు.విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో 46 వ, డివిజన్ కొండ ప్రాంతానికి చెందిన ఆమె కొండప్రాంత వాసుల కష్టాలు తాను అనుభవించింది. అందుకే కొండ ప్రాంత వాసులు కష్టాలు తీరుస్తా అంటూ సోమవారం తన డివిజన్ పరిధిలో ఎన్నికలు ప్రచారం చేశారు. కొండ ప్రాంతంలో సందు గొందులు తిరుగుటూ ఓటర్ల అభ్యర్థిస్తున్నారు. కొండ ప్రాంతంలో మెట్లు, మీ మీ సమస్యలు తనవిగా భావించి డివిజన్ రూపు రేఖలు మారుస్తానని ఆమె ఓటర్లకు హామీలు ఇచ్చారు.అడుగడుగునా ఆమెకి స్థానికులు ఘన స్వాగతం పలికారు. పలువురు మహిళా ఓటర్లు ఆమెను విజయోస్తు అంటూ దీవిస్తూ శాలువాలు కప్పి సత్కరించుకుని తమ తమ మద్దతు ప్రకటించారు.వందలాది కొండ ప్రాంత మెట్లు ఎక్కుతూ దిగుతూ నిర్విరామ ప్రచారం చేస్తున్నారు. స్థానిక సి పీ ఐ నాయకులు, కార్యకర్తలు ఈ ప్రచారంలో పాల్గొన్నారు.

## 43వ డివిజన్లో కర్నాటి రాంబాబు రమాదేవి దంపతులు ముమ్మర ప్రచారం



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26: (వార్త ప్రభ ప్రతినిధి)** నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను గెలిపించాలని 43వ డివిజన్ ఓటర్లకు వైఎస్సార్సీపీ కార్పొరేటర్ అభ్యర్థి కర్నాటి రాంబాబు రమాదేవి దంపతులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం డివిజన్లోని పలు ప్రాంతాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాటి రమాదేవి మాట్లాడుతూ తన ఎన్నికల ప్రచారంలో ప్రజల నుండి తనకు మంచి మద్దతు లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. డివిజన్ అభివృద్ధి కోసం ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తనను గెలిపించాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారని చెప్పారు. అయితే నేటి కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజానీకం అష్ట కష్టాలు పడుతున్నారని విమర్శించారు. నవంబర్ ఒకటవ తేదీన జరిగే ఎన్నికల్లోకార్పొరేటర్ అభ్యర్థిగా తనకు, మేయర్ అభ్యర్థిని రాయన భాగ్యలక్ష్మి కి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని ఓటర్లకు కర్నాటి రమాదేవి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో దుర్గగుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు మాట్లాడుతూ జగనన్న పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. కార్పొరేషన్ ఎన్నికల్లో 43వ డివిజన్ వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన సతీమణి కర్నాటి రమాదేవిని మంచి మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అలాగే మేయర్ అభ్యర్థిని రాయన భాగ్యలక్ష్మిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 45 వ డివిజన్లో జోరుగా ఇండిపెండెంట్ అభ్యర్థి పేరాబత్తుల రాజేశ్వరి ప్రచారం

**ఎన్నికల్లో కుండ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వినతి**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26 : (వార్త ప్రభ ప్రతినిధి)** నగరపాలక సంస్థ ఎన్నికల్లో కుండ గుర్తుపై ఓట్లు వేసి తనను గెలిపించాలని 45వ డివిజన్ ఓటర్లకు 45వ డివిజన్ ఇండిపెండెంట్ అభ్యర్థిని పేరాబత్తుల రాజేశ్వరి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె డివిజన్లోని పలు ప్రాంతాల్లో ముమ్మరంగా తన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ 45వ డివిజన్ అభివృద్ధి కోసం తనను కార్పొరేటర్గా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా కార్పొరేటర్ గా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం తనకు కుండ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో పేరాబత్తుల రమణ మాట్లాడుతూ 45 డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం నవంబర్ 1వ తేదీన జరగనున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో కుండ గుర్తుపై ఓట్లు వేసి తన సతీమణి పేరాబత్తుల రాజేశ్వరిని గెలిపించాలని డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డివిజన్లో ఎక్కడికి వెళ్ళినా ప్రజలు ఆదరించి కుండ గుర్తుపై ఓట్లు వేస్తామని చెబుతున్నారని ఆయన చెప్పారు. ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు సాదరంగా స్వాగతించి తమకు బ్రహ్మరథం పడుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 45వ డివిజన్ లో వైసిపి అభ్యర్థిని పిళ్ళా కళ్యాణి విస్తృత ప్రచారం

**మేయర్ గా రాయన భాగ్యలక్ష్మి ని 45 వ డివిజన్ కార్పొరేటర్ గా పిళ్ళా కళ్యాణి ని గెలిపించండి-మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు పిలుపు**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26:(వార్త ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగర మేయర్ గా శ్రీమతి రాయన భాగ్యలక్ష్మి ని, 45 వ, డివిజన్ కార్పొరేటర్ గా పిళ్ళా కళ్యాణి ని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించండని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం పిళ్ళా కళ్యాణి విజయాన్ని కాంక్షిస్తూ 45 వ, డివిజన్ లో అయన ఎన్నికల ప్రచారం చేశారు అలాగే స్థానిక 45వ డివిజన్ అభివృద్ధి కోసం నగర పాలక సంస్థ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనకు మంచి మెజారిటీతో విజయం చేకూర్చాలని 45వ డివిజన్ ఓటర్లకు 45వ డివిజన్ వైసిపి అభ్యర్థిని పిళ్ళా కళ్యాణి విజ్ఞప్తి చేశారు. సోమవారం 45వ డివిజన్ లోని పలు ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థిని పిళ్ళా కళ్యాణి తన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు వీధుల్లో ఇంటింటికి వెళ్లి తనకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పిళ్ళా కళ్యాణి మాట్లాడుతూ 45వ డివిజన్ అభివృద్ధి కోసం నవంబర్ 1వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను,మేయర్ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కార్పొరేటర్ అభ్యర్థిని పిళ్ళా కళ్యాణి, వైసిపి డివిజన్ ప్రెసిడెంట్ పిళ్ళా సూరిబాబు (జగ్గు), నాయకులు అయితా కిషోర్, శిరం వెంకట్రావు, కోరికాని నాగు, బేవర చిన్న, దాసిన ఏసు , పిళ్ళా దుర్గారావు, పిళ్ళా అచ్యుతరావు, నాగూర్, బడే మనోహర్, అమరనాద్, గురువులు,చొక్కార వెంకటేష్, కుంచం ఏసు, తొత్తడి వరలక్ష్మి, షేక్ సయ్యద్, చిచ్చా, సోమేశ్,తమ్మిన రఘు,మజ్జి మురళి,దుక్క హరి,రాధా, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 55 వ డివిజన్లో తెదేపా అభ్యర్థి పెద్ది రమేష్ ముమ్మర ప్రచారం

**అడుగడుగునా బ్రాహ్మరథం పడుతున్న స్థానిక ఓటర్లు**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26 :(వార్త ప్రభ ప్రతినిధి)** స్థానిక 55వ డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం నవంబర్ 1వ తేదీన జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి తనను గెలిపించాలని 55వ డివిజన్ ఓటర్లకు ఆ డివిజన్ తెలుగుదేశం అభ్యర్థి పెద్ది రమేష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం 55 డివిజన్లో పెద్ది రమేష్ డివిజన్లోని పలు ప్రాంతాల్లో కూటమి నాయకులతో కలిసి ముమ్మర ప్రచారం నిర్వహించారు. స్థానిక ఓటర్లు పెద్ది రమేష్ ప్రచారానికి బ్రాహ్మరథం పడుతున్నారు.ఈ సందర్భంగా పెద్ది రమేష్ మాట్లాడుతూ జనసేన, బిజెపి బలపరిచిన కూటమి అభ్యర్థిగా ఎన్నికల్లో నిలిచిన తన పట్ల ప్రజల్లో ఎంతో ఆదరణ కనబడుతోందని చెప్పారు. కార్పొరేటర్ గా ఎన్నికైన తర్వాత 55వ డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని పెద్ది రమేష్ హామీ ఇచ్చారు. నవంబర్ 1వ తేదీన జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి తనను , మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణకు గాజు గ్లాస్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

**12 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి జనసేన అభ్యర్థి విజయ దుర్గ**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 26(వార్తా ప్రభ ప్రతినిధి):**12వ వార్డులో తాను గెలిపిస్తే వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికల రూపొందిస్తానని హామీ ఇచ్చారు 12వ వార్డు జనసేన పార్టీ అభ్యర్థిని బొలియశెట్టి విజయ దుర్గ అన్నారు. కొండపల్లి మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 12వ వార్డులో ఆమె ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులోని ప్రతిఒక్క ఓటరును కలిసి గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను, సైకిల్ గుర్తుపై ఓటు వేసి చైర్ పర్సన్ అభ్యర్థిని కన్నెకంటి అమూల్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విజయదుర్గ మాట్లాడుతూ తన భర్త, జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు బొలి యశెట్టి శ్రీకాంత్ అండదండలతో జనసేన పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. అలాగే వార్డును అభివృద్ధి పథంలో నిలిపేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. తాగునీరు, డ్రెయినేజీ, రోడ్లు సమస్యల పరిష్కారమే తమ లక్ష్య మన్నారు. కౌన్సిలర్ గా తనను గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 49వ డివిజన్లో అడ్డూరి శ్రీరామ్ గెలుపు కోసం కూటమి నేతల విస్తృత ప్రచారం





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26:(వార్త ప్రభ ప్రతినిధి)** పశ్చిమ నియోజకవర్గం 49వ డివిజన్ లో కూటమి బలపరిచిన బిజెపి అభ్యర్థి అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు. నెహ్రూ బొమ్మ సెంటర్ నుండి ప్రారంభమైన ఈ రోడ్ షోలో మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ , విజయవాడ ఎంపీ శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని) , 49వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు.నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద ప్రజలు నేతలకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ 50 ఏళ్లుగా పరిష్కారం కాని కొండ ప్రాంత ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. సుమారు 26,500 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చాం. వరదల సమయంలో సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యలు ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయి. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల్లో సమన్వయంతోనే నగర అభివృద్ధి సాధ్యం అని అన్నారు. మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజల స్పందనే మా బలం. ఎంపీ, ఎమ్మెల్యే, బీజేపీ నేతలతో ఐక్యతతో అభివృద్ధి చేస్తాం. కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చి నగరాన్ని అభివృద్ధి చేస్తాం అని అన్నారు.ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ 49వ డివిజన్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి విజయవాడ నగరంలోనే 49వ డివిజన్ను ఒక ఆదర్శ డివిజన్గా తీర్చిదిద్దడమే నా లక్ష్యం అని హామీ ఇచ్చారు. కాగా సోమవారం డివిజన్లో అడ్డూరి శ్రీరామ్ కూటమి నాయకులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి కమలం గుర్తుపై ఓట్లు వేసి తనను, గాజు గ్లాసు గుర్తుపై ఓట్లు వేసి మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 40వ డివిజన్లో జోరుగా వైసిపి అభ్యర్థి అల్లం భువన్ కుమార్ ప్రచారం



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26: (వార్త ప్రభ ప్రతినిధి)** నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనకు అఖండ విజయం చేకూర్చాలని 40వ డివిజన్ ప్రజానీకానికి 40వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ అభ్యర్థి అల్లం భువన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమవారం 40 వ డివిజన్లోని పలు ప్రాంతాల్లో ఆయన ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలసి తనకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా అల్లం భువన్ కుమార్ మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీన జరగనున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను, మేయర్ అభ్యర్థిని రాయన భాగ్యలక్ష్మి నీ అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 40 వ డివిజన్ ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని ప్రకటించారు. డివిజన్ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా తాను పనిచేస్తానని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో కోట్లాది రూపాయల వ్యయంతో డివిజన్లో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. కార్పొరేటర్ గా తనను గెలిపిస్తే డివిజన్ లో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, యువ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## 51వ డివిజన్లో వైసిపి అభ్యర్థి షేక్ సలీం ఇంటింటి ప్రచారం



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26: (వార్త ప్రభ ప్రతినిధి)**నగర పాలక సంస్థ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను గెలిపించాలని 51 వ డివిజన్ ఓటర్లకు 51 డివిజన్ వైసిపి అభ్యర్థి షేక్ సలీం విజ్ఞప్తి చేశారు. సోమవారం డివిజన్లోని పలు ప్రాంతాల్లో సలీం తన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ సలీం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలోనే డివిజన్లో అభివృద్ధి జరిగిందని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వ పాలనలో ఏమాత్రం అభివృద్ధి లేదని విమర్శించారు. 51వ డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం తనను కార్పొరేటర్ గా గెలిపించాలని ఓటర్లను కోరారు. తన్ను కార్పొరేటర్ గా గెలిపిస్తే డివిజన్ ను అన్ని విధాల అగ్ర పదంలో నిలబెడతానని ఆయన హామీ ఇచ్చారు. తన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుండి మంచి మద్దతు లభిస్తోందన్నారు. నవంబర్ 1వ తేదీన జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో తనకు, వైసిపి మేయర్ అభ్యర్థిని రాయన భాగ్యలక్ష్మికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని ఓటర్లకు సలీం విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినయమే గొప్పది




అహంకారం పతనము
వినయశీలత విజయము
ఏది కావాలో! నీకు
తెలుసుకుంటే ఉత్తమము
పనికిమాలిన గర్వము
హరిస్తుందోయ్! సర్వము
ఆదిలోనే తుంచితే
అట్టి వాడే విజేతే
వినయ సంపద గొప్పది
పెంచుకుంటే మంచిది
కంఠ భూషణమే అది
జీవితంలో మేలది
నష్టమెంతో అహంతో
లాభమెక్కువ వినయంతో
అవకాశం ముందుంది
కోరుకో సముచితమైనది

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి





**రెడ్డిగూడెం అక్టోబర్ 26,(వార్తాప్రభ ప్రతినిధి ):**మైలవరం సీఐ కొత్తూరి కిషోర్ బాబు ఆధ్వర్యంలో నాగులూరు మరియు ఇతర అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ఐపీఎస్ ఆదేశాల మేరకు, రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ ఐపీఎస్ సూచనలతో, మైలవరం ఏసీపీ పి. రామచంద్రరావు మార్గదర్శకత్వంలో ఈరోజు రెడ్డిగూడెం మండలంలోని నాగులూరు మరియు ఇతర అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కొత్తూరి కిషోర్ బాబు పాల్గొని పోలీసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం, ప్రజల్లో భద్రతపై నమ్మకం కల్పించడం, ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం సీఐ కొత్తూరి కిషోర్ బాబు, రెడ్డిగూడెం ఎస్ఐ శ్రీనివాస్, ఎస్ఐ గిరిసాయి, మహిళా ఎస్ఐ గిరిజామణి మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి, అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు, శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించే ముందు సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతులు పొందాలని, అనుమతుల్లో పేర్కొన్న సమయం, ప్రదేశం, మార్గం, ఇతర షరతులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి కూడా అవసరమైన అనుమతులు తీసుకోవాలని తెలిపారు. రాజకీయ విభేదాల కారణంగా పరస్పరం దూషించుకోవడం, రెచ్చగొట్టడం, ఘర్షణలకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. వాట్సాప్ స్టేటస్‌లు, సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు, వదంతులు, విద్వేషపూరిత సందేశాల ద్వారా గ్రామాల్లో ఉద్రిక్తతలు సృష్టించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓటర్లను బెదిరించడం, అడ్డుకోవడం, బలవంతం చేయడం, డబ్బు, మద్యం, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలతో ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నించడం చట్టవిరుద్ధమని తెలిపారు. ప్రతి ఓటరూ స్వేచ్ఛగా తనకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసే హక్కును అందరూ గౌరవించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా అల్లర్లు, ఘర్షణలు సృష్టించే వారిని అందుబాటులో ఉన్న డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి క్రిమినల్ కేసుల్లో చిక్కుకుని తమ వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబ ప్రశాంతతను, భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని హితవు పలికారు. మీ ప్రవర్తనను మీ పిల్లలు గమనిస్తుంటారు. వారికి బాధ్యత, సంయమనం, చట్టం పట్ల గౌరవం నేర్పేలా ప్రవర్తించండి. రాజకీయ విభేదాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి. గ్రామాల్లో స్నేహభావం, సామరస్యం శాశ్వతంగా కొనసాగాలి" అని ప్రజలకు సూచించారు. పోలింగ్ రోజున ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఓటుహక్కును వినియోగించుకోవాలని, ఓటు వేసిన అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద అనవసరంగా గుమిగూడకుండా ప్రశాంతంగా వెళ్లిపోవాలని కోరారు. పోలింగ్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించరాదని, ఓటర్ల రాకపోకలను అడ్డుకోవద్దని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి బెదిరింపులు, ప్రలోభాలు, ఘర్షణలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై రాజకీయ పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకుంటామని, ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో సహకరించాలని మైలవరం సర్కిల్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## 41వ డివిజన్‌లో టిడిపి అభ్యర్థి కొండ జమలయ్య ముమ్మర ప్రచారం





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26: (వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని స్థానిక 41వ డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం నగరపాలక సంస్థ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి తనకు విజయం చేకూర్చాలని 41 డివిజన్ తెలుగుదేశం అభ్యర్థి కొండ జమలయ్య ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జనసేన, బిజెపి నాయకులతో కలిసి డివిజన్లోని పలు ప్రాంతాల్లో జమలయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ డివిజన్లో తన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ గా తనను గెలిపిస్తే 41వ డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. కొండ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. నవంబర్ ఒకటో తేదీన జరగనున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు జమలయ్య విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల ప్రచారంలో 41వ డివిజన్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, జనసేన డివిజన్ అధ్యక్షురాలు బొమ్మ గోవిందలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనిగండ్లపాడు గ్రామంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్





**పెనుగంచిప్రోలు - అక్టోబర్ 26(వార్త ప్రభ )** ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతమైన, పారదర్శకమైన వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా, పెనుగంచిప్రోలు మండలంలోని హైపర్ సెన్సిటివ్ గ్రామమైన అనిగండ్లపాడులో జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ సోమవారం నిర్వహించడం జరిగింది. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రతలను కాపాడేందుకు, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించినా చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ (మైక్) ద్వారా గ్రామ ప్రజలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఎన్నికల సమయంలో అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించరాదని, ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం లేదా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడటం చట్టరీత్యా నేరమని ప్రజలకు వివరించడం జరిగింది. ప్రజలందరూ ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, పోలీసు మరియు ఎన్నికల అధికారులకు సహకరించాలని సూచించడం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరడం జరిగింది. ప్రజల సహకారంతో ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగానిర్వహించేందుకు పెనుగంచిప్రోలు పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలియజేయడం జరిగింది...

## ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ కి విమానాశ్రయంలో ఘన స్వాగతం





**గన్నవరం, అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు విచ్చేసిన గౌరవ భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, పలువురు ఉన్నతాధికారులు విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి కి సాదరంగా స్వాగతం పలికారు.

## నన్ను నమ్మండి ఆదరించండి నిరంతరం మీకు అండగా వుంటా

**44వ డివిజన్ వైసిపీ కార్పొరేటర్ అభ్యర్థి కూరాకుల నాగ**





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26 :(వార్త ప్రభ ప్రతినిధి)** నన్ను నమ్మండి ఆదరించండి నిరంతరం మీకు అండగా వుంటా అంటూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో 44 వ డివిజన్ వైసిపీ అభ్యర్థి కూరాకుల నాగ సోమవారం తన ఎన్నికల ప్రచారంలో ఓటర్ల ని అభ్యర్థించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 44వ డివిజన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి కూరాకుల నాగేశ్వరరావు (నాగ) ఎన్నికల ప్రచార కార్యక్రమం జోరుగా సాగింది. 44వ డివిజన్ ఎన్నికల ప్రధాన కార్యాలయం కొవ్వూరి బిల్డింగ్ నుండి టేనర్ పేట యలపర్తి బిక్షాలు (బూస్టర్)సందు, కాశీపతి వీధి, జొన్నలగడ్డ మస్తాన్ వీధి, (డివిజన్ ఓటర్స్ ఉన్న కొద్ది భాగం) కొండ పైభాగం మరియు ఐజాక్ వీధి నుంచి ఉప్పలపాటి రామచంద్ర రాజు వీధి వరకు కొండ క్రింది భాగంలో డోర్ టు డోర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేయర్ గా శ్రీమతి రాయన భాగ్యలక్ష్మి కి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, స్థానిక కార్పొరేటర్ గా తనకి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీ తో గెలిపించాలని కూరాకుల నాగ ఓటర్ల కు విజ్ఞప్తి చేస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వైసిపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## నాణ్యతతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యం

**- ఘనంగా క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా 12వ మహాసభ ముగింపు వేడుకలు**




**తిరుపతి, అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నాణ్యతాభివృద్ధి, నిరంతర మెరుగుదల, నూతన ఆవిష్కరణలతోనే సంస్థలు సుస్థిర ప్రగతిని సాధించగలవని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా తిరుపతి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పన్నెండవ నాణ్యతా వలయాల మహాసభ ముగింపు వేడుకలు ఆదివారం తిరుపతిలోని ఎస్వీ కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ మహాసభలో తిరుపతి ప్రాంతం నుంచి 226, శ్రీసిటీ ప్రాంతం నుంచి 106 బృందాలు కలిపి మొత్తం 332 బృందాలకు చెందిన 2,050 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ పరిశ్రమలకు చెందిన బృందాలు తమ సంస్థల్లో ఎదురైన సమస్యలు, వాటికి కనుగొన్న పరిష్కారాలు, నాణ్యతాభివృద్ధికి చేపట్టిన చర్యలను ప్రదర్శనల ద్వారా వివరించాయి. తిరుపతి శాఖ అధ్యక్షుడు జగన్ మోహన్ మాట్లాడుతూ, నాణ్యతా వలయాలను బలోపేతం చేయడానికి సమస్యల విశ్లేషణ, సమర్థవంతమైన ప్రదర్శనలపై దృష్టి సారించాలని సూచించారు. ఉద్యోగుల నిబద్ధతతో పాటు యాజమాన్యాల ప్రోత్సాహం కీలకమని పేర్కొన్నారు. శాఖ కార్యదర్శి వి. సులోచన, ఉపాధ్యక్షుడు ఎం. సుభాష్ తదితరుల సేవలను అభినందించారు. అపోలో టైర్స్ విభాగాధిపతి ఆనంద్ సత్యమూర్తి మాట్లాడుతూ, తిరుపతి శాఖ దేశంలోనే మొదటి స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. జ్ఞానాన్ని ఆచరణలో పెట్టినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. వేము సాంకేతిక విద్యా సంస్థ ప్రధానాచార్యుడు డాక్టర్ నవీన్ కిలారి మాట్లాడుతూ, నాణ్యతతో పాటు నిరంతర అభివృద్ధి, సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని సూచించారు. హీరో మోటోకార్ప్ కర్మాగార అధిపతి ప్రభు మాట్లాడుతూ, పరిశ్రమల మధ్య జ్ఞాన మార్పిడి, ఉత్తమ పద్ధతుల భాగస్వామ్యం అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. గల్లా అమర రాజా గ్రూపు మాజీ అధ్యక్షుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి విజయ్ నాయుడు గల్లా మాట్లాడుతూ, వ్యర్థాలను తగ్గించి వినియోగదారులకు మరింత విలువను అందించడమే నాణ్యతకు అసలైన అర్థమని వివరించారు.

అత్యుత్తమ సంస్థలకు పురస్కారాలు : మహాసభలో ఉత్తమ సంస్థ విభాగంలో ఐదు, ఉత్తమ సుస్థిరత విభాగంలో రెండు, ఉత్తమ సంస్థాగత పరివర్తన విభాగంలో మూడు, ఉత్తమ నాయకత్వ విభాగంలో మూడు పురస్కారాలను ప్రదానం చేశారు. అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థకు ఉత్తమ సంస్థ పురస్కారం లభించింది. ఉద్యోగుల్లో సమష్టి కృషి, బాధ్యత, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంపొందించి, ప్రతి స్థాయిలో నాణ్యతా సంస్కృతిని అభివృద్ధి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమ విజయానికి సహకరించిన వారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులు సామాజిక సేవల్లో భాగస్వాములు కావాలి



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 26 :(వార్త ప్రభ ప్రతినిధి )**విద్యార్థులు సామాజిక సేవల్లో భాగస్వాములు కావాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో యెస్ (యువర్ ఎఫర్ట్స్ టు సొసైటీ ) క్లబ్ ద్వారా 'జాయ్ ఆఫ్ గివింగ్ వీక్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అందులో భాగంగా భాగంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకుల సహకారంతో వివిధ నిత్యావసర వస్తువులు, దుస్తులను సేకరించారు. సేకరించిన వస్తువులన్నింటినీ గొల్లపూడిలో ఉన్న ఎస్‌కేవీసీ చిల్డ్రన్ విలేజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ దాతృత్వాన్ని పెంచుకోవటంతో పాటుగా పరోపకార గుణాలు కలిగి ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ మాట్లాడుతూ సమాజంలోని నిరుపేద పిల్లలకు సహాయం చేయడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, మానవతా విలువలు మరియు సేవాభావాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కోశాధికారి కాజా రాఘవయ్య, విభాగాధిపతి డాక్టర్ వీ చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

## అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా

**11వ వార్డులో జోరుగా సాగుతున్న వైఎస్ఆర్సిపి కౌన్సిలర్ అభ్యర్థి చక్రధర్ ప్రచారం**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 26(వార్తా ప్రభ ప్రతినిధి):**తనను కౌన్సిలర్ గా గెలిపిస్తే 11వ వార్డులో అభివృద్ధి చేసి చూపిస్తానని మాట ఇచ్చి ప్రచారం చేస్తున్నారు వైఎస్ఆర్సిపి కౌన్సిలర్ అభ్యర్థి దాచేపల్లి చక్రధర్ నాగేశ్వరావు. ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను కౌన్సిలర్ గా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుంటున్నారు. తనను గెలిపించి అవకాశం కల్పిస్తే వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తానని అన్నారు. స్థానిక అభ్యర్థిగా తనకు సమస్యలపై అవగాహన ఉందని ప్రజలకు వివరించారు. ప్రచారంలో భాగంగా అందర్నీ పలకరిస్తూ ముందుకు సాగుతున్నారు. చైర్మన్ గా నల్లమోతు తేజస్వి కు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించి కొండపల్లి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## జాతీయ వేదికపై కేబీఎన్ కళాశాల కీర్తిపతాకం

**- అఖిల భారత వాయు సైనిక్ శిబిరంలో క్యాడెట్ మహిత జ్యోతికి స్వర్ణ పతకం**



**విజయవాడ పశ్చిమ అక్టోబరు 26 :(వార్త ప్రభ ప్రతినిధి)** జాతీయ స్థాయిలో విజయవాడ కీర్తిని చాటుతూ కేబీఎన్ కళాశాల ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ క్యాడెట్ కార్పొరల్ జెడ్. మహిత జ్యోతి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. చెన్నైలోని తాంబరం ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 13 వరకు నిర్వహించిన అఖిల భారత వాయు సైనిక్ శిబిరంలో ఆరోగ్యం--పరిశుభ్రత విభాగంలో ఈ ఘనత సాధించింది. దేశవ్యాప్తంగా 17 డైరెక్టరేట్లకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్న ఈ ప్రతిష్ఠాత్మక శిబిరంలో మహిత జ్యోతి ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్‌తో పాటు కేబీఎన్ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది. సోమవారం కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి మాట్లాడుతూ, ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ ప్రారంభమైన తొలి సంవత్సరంలోనే విద్యార్థిని జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. మహిత జ్యోతి విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి. శ్రీనివాసు మాట్లాడుతూ, విద్యతోపాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, సేవా కార్యక్రమాల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. ఎన్‌సీసీ శిక్షణ క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, దేశభక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. హిందూ హైస్కూల్స్ కమిటీ పరిపాలనాధికారి డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ, మహిత జ్యోతి సాధించిన విజయం కళాశాలకే కాకుండా ఎన్‌సీసీ క్యాడెట్లందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకృష్ణ, ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ కె.పి.టి. విజయ భాస్కర్, ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ కేర్‌టేకర్ ఆఫీసర్ ఎ.హెచ్.డి. ప్రకాశ్ పాల్గొని స్వర్ణ పతక విజేత మహిత జ్యోతిని అభినందించారు.

## సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నేత చెరుకుమల్లి

**38వ వార్డులో జనసేన అభ్యర్థిని చెరుకుమల్లి రాధిక విస్తృత ప్రచారం**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 22 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపరిచిన 38వ వార్డు జనసేన పార్టీ అభ్యర్థి చెరుకుమల్లి రాధిక గురువారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొండపల్లి మున్సిపాలిటీలో ఎన్నో పోరాటాలు చేసిన చెరుకుమల్లి సురేష్ భార్య అయినా రాధిక వార్డులో పర్యటించి గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను కౌన్సిలర్ గా గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. వార్డు సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, తనను గెలిపిస్తే సమస్యలు పరిష్కరించి వార్డును అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 39వ వార్డు అభివృద్ధే లక్ష్యం

**● వార్డుపై గత పాలకమండలి నిర్లక్ష్యం ● కౌన్సిలర్ అభ్యర్థి మొగిలి విజయ్**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 26(వార్తా ప్రభ ప్రతినిధి):**39వ వార్డు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని, బాధ్యతగా సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు వివరిస్తూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు 39వ వార్డు వైఎస్ఆర్సిపి కౌన్సిలర్ అభ్యర్థి మొగిలి విజయ్ కుమార్. ఇంటింటికి ప్రచారంలో భాగంగా సోమవారం వార్డు ప్రజలను కలిశారు. గతంలో పాలకమండలి నిర్లక్ష్యంగా వహించిందని విమర్శించారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. తనను గెలిపిస్తే పోరాడి సమస్యలు పరిష్కారిస్తానని స్పష్టం చేశారు. స్థానికుడిగా కొండపల్లి సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, కౌన్సిలర్ పదవిని బాధ్యతగా వహించి ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. ఫ్యాను గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని వార్డు అభివృద్ధికి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

## కూటమి అభ్యర్థి గీత్ చరణ్ విస్తృత ప్రచారం

**ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించిన జనసేన అభ్యర్థి**



**మచిలీపట్నం అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో మచిలీపట్నం నగరంలోని 1వ డివిజన్‌లో రాజకీయ సందడి నెలకొంది. నవంబర్ 1న జరగనున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన వంపుగడవల గీత్ చరణ్ పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన డివిజన్ పరిధిలో సోమవారం విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి స్థానిక ప్రజలను, ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో తనను ఆదరించి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. డివిజన్‌లో ప్రజలతో మమేకమవుతూ వారి ఆదరాభిమానాలను పొందేందుకు కృషి చేశారు. ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని, ప్రజల మద్దతుతో విజయం సాధించేలా సహకరించాలని ఓటర్లను కోరుతూ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా గీత్ చరణ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో మురుగునీటి వ్యవస్థను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు నిర్వహిస్తామని, ప్రతి వీధికి సిసి రోడ్లు వేసి వీధి దీపాలతో అలంకరిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీరు అందే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వంపుగడవల చౌదరి, రాజా హక్కుమంతి, బత్తిన దాసు, ఎన్నింటి గణేష్, శీలం శశాంక్, శీలం నాయుడు, మాకాల ప్రసాద్, జగన్మోహన్ రావు, పళ్లెం రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులకు ఓటేయండి

**టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు**

**23వ వార్డులో చైర్మన్ అభ్యర్థి అమూల్య తో కలిసి ప్రచారం నిర్వహించిన సూర్య యాదవ్**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 26(వార్తా ప్రభ ప్రతినిధి):** అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు. కొండపల్లి మునిసిపాలిటి పరిధిలోని 23వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి చెన్నుబోయిన సూర్య యాదవ్ చైర్మన్ అభ్యర్థి అమూల్య తో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కొండపల్లి అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి కూటమి చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థులకు ఓటర్లను అభ్యర్థించారు.

## యాళ్ళ దంపతులకు బ్రహ్మరథం

**విజయం దిశగా యాళ్ళ**



**ప్రత్తిపాడు అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రత్తిపాడు గ్రామం 2,3 వార్డులు ఎంపీటీసీలు కూటమి అభ్యర్థులు యాళ్ళ జగదీష్, యాళ్ళ మంగదేవి ఎన్నికల ప్రచారానికి ఇందిరా కాలనీలో బ్రహ్మరథం పట్టారు. దీనిలో భాగంగా అంబేద్కర్ జంక్షన్ లో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం, బ్యాండ్ మేళాలు, భాజా భజంత్రీల నడుమ ఇందిరా కాలనీలోకి భారీ ర్యాలీగా ప్రవేశించారు. యాళ్ళ జగదీష్ వ్యక్తిత్వం, చేసిన సేవలను గుర్తుగా కాలనీలోని మహిళలు, వృద్ధులు, యువత ఉత్సాహంగా తరలివచ్చారు. దంపతులు ఇద్దరినీ బ్రహ్మరథం పట్టి, పూలమాలలతో సత్కరించి, మంగళ హారతులతో ఆశీర్వదించారు. యాళ్ళ కుటుంబం అంటేనే నమ్మకం, సేవకు మారుపేరని కాలనీవాసులు కొనియాడారు. ఈ సందర్భంగా కాలనీ అంతా నినాదాలతో హోరెత్తింది. జై భీమ్ జై యాళ్ళ ఫ్యామిలీమంచి మనసున్న మనిషికి మా ఓటు సైకిల్ గుర్తుకే గాజు గ్లాసు గుర్తుకే మా ఓటు అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఈ ప్రచారంలో ఓటర్లు చూపుతున్న ప్రేమాభిమానాలతో ప్రత్తిపాడులో కూటమి విజయం ఖాయమని స్పష్టమవుతోంది. ఈ కార్యక్రమంలో ఖాదీ బోర్డు వైస్ చైర్మన్, కొమ్ముల కన్నబాబు, యాళ్ళ విశ్వేశ్వరరావు, మూరా సత్యనారాయణ, వరప్రసాద్, పోలిశెట్టి శ్రీను, అంబటి బుజ్జి, చెట్టు బత్తుల వీరబాబు,షర్టు బత్తుల నాని బాబు,మూర చిన్ని బాబు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల నేపథ్యంలో చేజర్లలో పోలీసుల కవాతు

**శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల అప్రమత్తత**



**చేజర్ల అక్టోబర్ 26 (వార్తాప్రభ)** ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు పోలీసులు రాత్రి కవాతు నిర్వహించారు. సంగం సర్కిల్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో చేజర్ల ఎస్ఐ అయ్యప్ప, ఎస్ఐ జిలానీ, సంగం ఎస్ఐ నాయక్‌తో పాటు పోలీసు సిబ్బంది కవాతులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారులు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు పర్యటించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు.

# తొండవాడ ముక్కోటి క్షేత్రంలో ఆధ్యాత్మిక వైభవం

**శ్రీ అగస్త్యేశ్వర స్వామి, ఆనందవల్లి అమ్మవార్ల కల్యాణోత్సవానికి పోటెత్తిన భక్తులు**



**చంద్రగిరి:అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆధ్యాత్మికత, భక్తిభావాల సుగంధంతో చంద్రగిరి మండలం తొండవాడ పుణ్యక్షేత్రం పులకించిపోయింది. శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్ర సమీపంలో, త్రివేణి సంగమ తీరాన వెలసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిప్రపత్తులతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ అగస్త్యేశ్వర స్వామివారికి, శ్రీ ఆనందవల్లి అమ్మవారికి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన దివ్య కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి, అమ్మవార్ల దివ్య మంగళ స్వరూపాలను దర్శించుకున్న భక్తులు శివనామస్మరణలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో మార్మోగింది. ముక్కోటి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల సమ్మేళనంగా తొండవాడ శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచుతున్నాయి.

# శ్రీసిటీలో ఇసుజు మోటార్స్ దశాబ్ది విజయోత్సవం

**- పదేళ్లలో లక్షకు పైగా వాహనాల ఉత్పత్తి.. 1,600 మందికి ఉపాధి**






**శ్రీసిటీ, అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రముఖ వాహన తయారీ సంస్థ ఇసుజు మోటార్స్ ఇండియా (ఐఎంఐ) శ్రీసిటీలో తన పదేళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పురస్కరించుకుని సోమవారం పరిశ్రమ ఆవరణలో ఘనంగా వేడుకలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పారిశ్రామిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు. పదేళ్లలో లక్షకు పైగా వాహనాలను ఉత్పత్తి చేసిన సంస్థ, దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఎగుమతుల్లోనూ విశేష గుర్తింపు సాధించింది. ఈ వేడుకలకు ఇసుజు గ్రూప్ ప్రెసిడెంట్, సీఈఓ నవోహిరో యమగుచి, మిత్సుబిషి కార్పొరేషన్ మొబిలిటీ గ్రూప్ సీఈఓ షిగేరు వకబయాషి, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ యువరాజ్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ యువరాజ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అనుకూల వాతావరణం, పెట్టుబడులకు అనువైన విధానాలు ఇసుజు అభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. తయారీ రంగం, ఎగుమతులు, ఉపాధి కల్పనలో సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. సంస్థ భవిష్యత్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, 2013లో ఇసుజుతో అవగాహన ఒప్పందం కుదిరినప్పటి నుంచి సంస్థ ప్రగతిని ప్రత్యక్షంగా వీక్షించడం ఆనందంగా ఉందన్నారు. నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ ఇసుజు సాధించిన విజయాలు శ్రీసిటీలోని పటిష్ఠమైన పారిశ్రామిక మౌలిక సదుపాయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంస్థలకు అవసరమైన సదుపాయాలు, వ్యాపారానుకూల వాతావరణాన్ని శ్రీసిటీ నిరంతరం కల్పిస్తోందని వివరించారు. ఇసుజు గ్రూప్ ప్రెసిడెంట్, సీఈఓ నవోహిరో యమగుచి మాట్లాడుతూ, సంస్థ విజయానికి ఉద్యోగులు, డీలర్లు, సరఫరాదారులు, ఇతర భాగస్వాముల కృషి ఎంతో కీలకమన్నారు. శ్రీసిటీ, రాష్ట్ర ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశంతో పాటు ప్రపంచ మార్కెట్లలో సంస్థ వృద్ధిని మరింత వేగవంతం చేయడమే లక్ష్యమని వెల్లడించారు. ఇసుజు ఇండియా ఛైర్మన్ కెంజిరో హెమ్మసన్ సంస్థ ప్రగతి, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. గత పదేళ్లలో శ్రీసిటీ ప్లాంట్‌లో సుమారు రూ.1,500 కోట్ల పెట్టుబడులు పెట్టిన సంస్థ, దాదాపు 1,600 మందికి ఉపాధి కల్పించింది. ఆసియా, మధ్యప్రాచ్య దేశాలకు వాహనాలను ఎగుమతి చేస్తోంది. 2024--25 ఆర్థిక సంవత్సరంలో 20 వేలకుపైగా వాణిజ్య వాహనాలను ఎగుమతి చేసి, భారత వాణిజ్య వాహనాల ఎగుమతుల్లో అగ్రస్థానాన్ని సాధించింది.

# 28వ వార్డులో వైసీపీ అభ్యర్థి పెదబాబు ప్రచారం..!

● గతంలో చేసిన అభివృద్ధే గెలుపునకు బాట వేస్తుందన్న ధీమా.. ● మూడోసారి కౌన్సిలర్‌గా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి



**అమలాపురం అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 28వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి చిట్టూరి వీర వెంకట సత్యనారాయణ మూర్తి (పెదబాబు) ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఆయన, గతంలో తాను చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ఓటర్ల మద్దతు కోరుతున్నారు. గతంలో 24వ వార్డుగా ఉన్న ప్రాంతం ప్రస్తుతం 28వ వార్డుగా మారిన నేపథ్యంలో, ఆ ప్రాంతంలో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేస్తూ ఈసారి కూడా తనకు అవకాశం కల్పించాలని పెదబాబు వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. రాబోయే రోజుల్లో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఆయన ప్రచారంలో వివరిస్తున్నారు. చిట్టూరి పెదబాబు స్నేహశీలి, దాతృత్వ గుణం కలిగిన వ్యక్తిగా, సౌమ్య స్వభావం ఉన్న నాయకుడిగా స్థానికంగా గుర్తింపు పొందారని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు ప్రజలతో ఉన్న పరిచయాలు, గతంలో చేసిన పనులు తనకు ఎన్నికల్లో కలిసివస్తాయని ఆయన ఆశాభావంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో 28వ వార్డులో మూడోసారి మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యే అవకాశం పెదబాబుకు ఉందని కొందరు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే, తుది ఫలితం ఓటర్ల తీర్పుపైనే ఆధారపడి ఉంటుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా "ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను,ఛైర్పర్సన్ అభ్యర్థిని విరితా దేవిని గెలిపించాలని" చిట్టూరి వీర వెంకట సత్యనారాయణ మూర్తి (పెదబాబు) వార్డు ప్రజలను కోరుతున్నారు.

# పాఠశాల గ్రంథాలయానికి పూర్వ విద్యార్థిని పుస్తకాల వితరణ




**ఆగిరిపల్లి అక్టోబర్ 26 (వార్తా ప్రభ దినపత్రిక):** ఏలూరు జిల్లా, నూజివీడు నియోజకవర్గం పూర్వ విద్యార్థిని తన పాఠశాలపై మమకారంతో విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి చేయూతనందించారు. అడవినెక్కలం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుతం అమెజాన్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ బెంగళూరులో స్థిరపడిన చలసాని పద్మ, అమెరికా నుంచి తెప్పించిన రూ.10 వేలకుపైగా విలువైన పుస్తకాలను పాఠశాల గ్రంథాలయానికి ఉచితంగా బహూకరించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ, తాను ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశానని, పాఠశాలపై ఉన్న అభిమానంతో ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ విజ్ఞాన పుస్తకాలను చదవడం వల్ల విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో ప్రయోజనం కలుగుతుందని, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఈ విజ్ఞానం సహాయపడుతుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వి. రమణ మాట్లాడుతూ, ఈ పుస్తకాలు ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థుల విజ్ఞానం, వినోదం, నైపుణ్యాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మ తండ్రి మాదల జనార్ధనరావు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహా కూటమి ఎంపీటీసీ అభ్యర్ధి సూరగాని వెంకటేశ్వరమ్మా ఎన్నికల ప్రచారం



**కృత్తివెన్ను అక్టోబర్ 26 వార్తా ప్రభ** కృత్తివెన్ను మండలం చిన గొల్లపాలెం ఎంపీటీసీ అభ్యర్థిగా మహా కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సూరగాని వెంకటేశ్వరమ్మా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలో ఎంపీ వల్లభనేని బాల సౌరీ సహకారంతో శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్ చేసిన అభివృద్ధి పనులనే ఎజెండాగా చూపుతూ తాము ఎంపీటీసీ అయ్యాక గ్రామంలో చేసే పనులని వివరిస్తూ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేస్తున్నారు ఈ సందర్భంగా సూరగాని వెంకటేశ్వరమ్మా వార్తా ప్రభ ప్రతినిధి తో మాట్లాడుతూ కృత్తివెన్ను మండలంలోని దాదాపు ప్రతి గ్రామంలో గత ప్రభుత్వం హయాంలో శిదిలా వ్యవస్థ కూ చేరిన రోడ్లు, పంచాయతీ పంపుల చెరువుల పిల్టార్ బెడ్లు ఎంపీ వల్లభనేని బాల సౌరీ సహకారంతో, శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్ కేవలం రెండున్నర ఏళ్లలో దాదాపు 80% బాగు చేశారు అని, ఉన్న వాటి పనులు కూడా ఎన్నికల కోడ్ అవ్వగానే పూర్తి చేస్తామని, తాము ఎంపీటీసీ అయ్యాక ఎంపీపీ నిధులతో జడ్పీ పాఠశాలల అభివృద్ధి కీ పునుకుంటామని, యిప్పటికే మండలంలో పల్లె పండుగా 1, పల్లెపండుగ 2.0, పల్లె పండుగా 3.0 ద్వారా రోడ్లు, డ్రైనేజీ లు, విద్యా, వైద్యం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో స్థానిక శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్, ఎంపీ వల్లభనేని బాల సౌరీ చేసిన అద్భుతమైన అభివృద్ధి పనుల వల్ల ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి కూటమి ప్రభుత్వం పై అద్భుతమైన స్పందన వస్తుంది అని ప్రజలు అభివృద్ధి, సంక్షేమం అందించే మహా కూటమి ప్రభుత్వం వైపు ఉన్నారు అనేది గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో వారి మొఖాల్లో స్పష్టంగా కనిపిస్తుంది అని, గత విధ్వంస పాలన నాయకులకు స్థానిక పోరులో డిపాజిట్ లు కూడా రావని అన్నారు.....

## తుపాను ప్రభావం.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు



**మచిలీపట్నం అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నబ్ తీవ్ర తుపాను ప్రభావం నేపథ్యంలో కృష్ణా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారులు రెండు రోజులపాటు సెలవులు ప్రకటించారు. మంగళవారం, బుధవారం పాఠశాలలకు సెలవులు వర్తిస్తాయని పేర్కొంటూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ ముందస్తు చర్యలు చేపట్టారు. తుపాను కారణంగా విద్యార్థులు పాఠశాలలకు రాకపోకలు సాగించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించిన విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు చరవాణి సందేశాల ద్వారా తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## పరిషత్ ఎన్నికల్లో 13 నామినేషన్లు ఉపసంహరణ




**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 26 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిషత్ ఎన్నికల్లో భాగంగా మండల పరిధిలో 13 మంది అభ్యర్థులు సోమవారం నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. కాచవరంలో జనసేన ఒకటి, వైసీపీ ఒకటి, ఇండిపెండెంట్ ఒకరు, కేతనకొండ - 1లో వైసీపీ రెండు, గుంటుపల్లి - 1లో టీడీపీ నుంచి ఒకరు, దాములూరులో వైసీపీ నుంచి ఒకరు, మూలపాడులో వైసీపీ నుంచి ఇద్దరు, జూపూడిలో వైసీపీ నుంచి ఒకరు, తుమ్మలపాలెంలో వైసీపీ నుంచి ఒకరు, గుంటుపల్లి - 2లో టీడీపీ నుంచి ఒకరు, ఈలప్రోలులో టీడీపీ నుంచి ఒకరు నామినేషన్లు ఉపసంహరించారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మంగళవారం ముగియనుంది. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 3:00 గంటల వరకు మాత్రమే సమయం ఉంది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్

**- వరాహస్వామి దర్శనం అనంతరం శ్రీవారికి ప్రత్యేక ప్రార్థనలు.. ఆలయ మర్యాదలతో స్వాగతం**



**తిరుమల, అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయాలను అనుసరిస్తూ ముందుగా శ్రీ వరాహస్వామివారిని దర్శించుకున్న అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఉపరాష్ట్రపతికి టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ స్వాగతం పలికారు. అర్చక బృందం ఆలయ సంప్రదాయాల ప్రకారం ఇస్తికఫాల్ స్వాగతం అందించింది. అనంతరం ఉపరాష్ట్రపతి ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత శ్రీ వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, శ్రీ యోగ నరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఉపరాష్ట్రపతికి వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో, అదనపు ఈవో స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీ బేడి ఆంజనేయస్వామివారిని కూడా ఉపరాష్ట్రపతి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, టీటీడీ బోర్డు సభ్యులు రామ్మూర్తి, దివాకర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జి.కొండూరు మండలంలో 30 నామినేషన్లు ఉపసంహరణ





**జి.కొండూరు: అక్టోబర్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక సంస్థలు (ఎంపీటీసీ, జెడ్పీటీసీ) ఎన్నికల కు సంబంధించి జి.కొండూరు మండలంలో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగు తోంది. అక్టోబర్ 21 నుంచి 23వ తేదీల్లో జి.కొండూరు మండలంలోని 16 ఎంపీటీసీ స్థానాలకు గాను టీడీపీ, వైసీపీ,జనసేన,బిఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులు 80 మంది నామినేషన్లు దాఖలు చేశారు. స్క్రూటిని అనంతరం 72 నామినేషన్లు ఆమోదం పొందాయి. ప్రస్తుతం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగు తుంది. ఈనెల 26వ తేదీ సోమవారం 30 నామినేషన్లను అభ్యర్థులు ఉపసంహరించు కున్నారు. వీరిలో వైయస్సార్ సీపీ కి చెందిన 17, టీడీపీ కి చెందిన 12, ఇండిపెండెంట్ 1 చొప్పున ఉన్నాయని జి.కొండూరు మండలం రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ నెల 27 తేదీ మంగళవారం సాయంత్రం 3 గంటలవరకు నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంది. ఇదే రోజు సాయంత్రం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ఫైనల్ లిస్ట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విడుదల చేస్తారు.

## వీరాంజనేయ ఆలయంలో ధర్మకర్తల భేటీ

### జమా ఖర్చులకు ఆమోదం !



**గుడివాడ,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** గుడివాడ బంటుమిల్లి రోడ్డులోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు జరిగింది. చైర్మన్ టి. వరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఈవో యార్లగడ్డ వాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానానికి సంబంధించిన నిరాస్తులు, జమా ఖర్చులను క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించారు. అలాగే ఆలయ అభివృద్ధి, రాబోయే కార్యక్రమాల నిర్వహణపై చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో ట్రస్టీలు గొరిపర్తి వెంకట ప్రసాద్, తలారి ఇందిర, భారతుల వెంకట రమణ మూర్తి, కొల్లూరి శశికళ, బెజవాడ మంజుల, పొట్లూరి రమాదేవి, పులిపలుపుల మణికంఠ కుమార్, వీరములగు పార్వతి, బొగ్గవరపు రాజేష్ ఖన్నా, వంగలపాటి దివ్య, ఎక్స్ అఫీషియో మెంబర్ (అర్చక) వై వి భాస్కరరావు లు పాల్గొన్నారు.

## అక్రమ మద్యంపై ఉక్కుపాదం

### గుడివాడలో ఎక్సైజ్ దాడులు.. 54 మద్యం సీసాలు స్వాధీనం..



**గుడివాడ,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** ఎన్నికల నేపథ్యంలో గుడివాడ నియోజకవర్గంలో ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్) సిహెచ్. లావణ్య ఆదేశాల మేరకు విజయవాడ ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు సోమవారం గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అక్రమ మద్యం నిల్వలు, విక్రయాల నియంత్రణే లక్ష్యంగా చేపట్టిన ఈ తనిఖీల్లో గుడ్లవల్లేరు మండలంలో పంచుమర్తి సురేష్ అనే వ్యక్తి వద్ద నుండి 54 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకటేశ్వరమ్మ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ జి. ఆనంద్, హెడ్ కానిస్టేబుల్ పి. చెన్నారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల నేపథ్యంలో నిఘా మరింత కట్టుదిట్టం చేస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## ఏఎన్ఆర్ కళాశాల ఎన్.సి.సి క్యాడెట్స్ ప్రతిభ

### -ట్రెక్కింగ్ క్యాంపు, శిక్షణ శిబిరంలో పాల్గొని శిక్షణ



**గుడివాడ,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ఐదుగురు ఎన్.సి.సి. క్యాడేట్స్ ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపు మరియు కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరంలో శిక్షణ పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్ తెలియజేసారు. గుంటూరులో జరిగిన ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపులో ఇద్దరు ఎన్.సి.సి. క్యాడేట్స్ ఎన్. లక్ష్మి ప్రసన్న, పి. శ్రావణి లు పాల్గొని కొండవీడు ఫోర్టు, కొండపల్లి ఫోర్టు, కోటప్పకొండ, మంగళగిరి ఎకో పార్క్ లను సందర్శించి పర్వతారోహణముల మీద శిక్షణ తీసుకొన్నారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల లో జరిగిన కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరంలో ముగ్గురు ఎన్.సి.సి. క్యాడేట్స్ ఎస్. రవి కిరణ్, ఆర్.రాజేష్ కుమార్, ఎస్.కె. నాగూర్ మీరావలి పాల్గొని శిక్షణ తీసుకున్నారని ఈ శిక్షణ కార్యక్రమములో మంచి ప్రతిభ కనపర్చినందుకు గాను ఎస్. రవి కిరణ్ ను అసాధారణ పనితీరు పురస్కారం (అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మన్స్ అవార్డు) ఇవ్వడం జరిగింది. మరియు ఎన్.సి.సి. అధికారి లెఫ్టినెంట్ ఎం.డి. సలీం కు కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రూపేష్ అవస్థి అభినందన జ్ఞాపికను అందజేశారు. ఈ శిక్షణ శిబిరములో పాల్గొనడం అభినందనీయమని కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ ఎల్.ఆర్ .కె. ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఎన్.సి.సి. అధికారి లెఫ్ట్ నెంట్ ఎం.డి.సలీం క్యాడేట్స్ ను అభినందించారు.

## కలగర వైసిపి ఎంపీటీసీ దేశిరెడ్డి రమా శ్రీనివాసరెడ్డి ప్రచారం ప్రారంభం



**విస్సన్నపేట,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని ప్రతిష్టాత్మకమైన కలగర ఎంపీటీసీ స్థానానికి వైసీపీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న దేశి రెడ్డి రమ( శ్రీనివాసరెడ్డి) తమ ప్రచారాన్ని సెంటిమెంట్ ఆనవాయితీకి అనుగుణంగా ములగలపాటివారిగూడెం వైఎస్ఆర్ విగ్రహం వద్ద వేదపండితులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో కొబ్బరికాయ కొట్టి ప్రచారాన్ని ప్రారంభించారు. గతంలో ఇదేవిధంగా తాను ఎంపీటీసీగా, గ్రామ సర్పంచిగా ప్రచారం చేయడం జరిగిందని ప్రత్యక్ష ఎన్నికలలో ఓటర్ దేవుళ్ళ ఆశీస్సులతో ఎంపీటీసీగా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తానని ఎంపీటీసీ అభ్యర్థి దేశి రెడ్డి రామా శ్రీనివాసరెడ్డి ఆమె తెలియజేశారు. గ్రామంలో గడపగడపకు వెళ్లి ఆమె ఓటర్లను కలిసి కలగర సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థినిగా తాను, జడ్పిటిసి అభ్యర్థినిగా గామాసు రాదకు వైసీపీ పార్టీ తరఫున పోటీ చేస్తున్నామని తమ పవిత్రమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు వేయవలసిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. పోలింగ్ బూత్ లో రెండు ట్రిప్పులు ఇస్తారని 2 పేపర్ల పైన ఫ్యాన్ గుర్తులను గుర్తించి ఓటు వేయాలని ఆమె విపులంకరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు నారగాని నాగేశ్వరరావు, తిరువూరు నియోజకవర్గ యూత్ నాయకులు దేశి రెడ్డి శ్రీనివాసరెడ్డి వైసీపీ సీనియర్ నాయకులు కోపూరి తిరుపతిరావు, సర్వేశ్వరరావు ,రమేష్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల వైభవం గుడివాడలో..

### గుడివాడకు చిన్న జీయర్ - నెలరోజుల ధనుర్మాస వైభవం



**గుడివాడ,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా గుడివాడ పాటిమీద జగన్నాథపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 2026-27 వార్షిక ధనుర్మాస మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాలు డిసెంబర్ 16, 2026 నుండి జనవరి 14, 2027 వరకు నెల రోజుల పాటు పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి స్వహస్తాలతో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ చల్లా ఇందిరా రమణారావు, ఆలయ చైర్మన్ లింగం శివరామ ప్రసాద్, ఈవో కందుల వేణుగోపాలరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చక స్వాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్లా ఇందిరా రమణారావు మాట్లాడుతూ.. మహోత్సవాల నిర్వహణకు స్వచ్ఛంద సేవా వాలంటీర్ల దరఖాస్తులు దేవస్థానంలో అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గలవారు ఈ నెల 31 లోపు పూర్తి చేసి అందించాలని కోరారు. స్వామి వారి రాక సందర్భంగా భక్తులు తమ సూచనలు, సలహాలు అందించాలని కోరారు. నెలరోజుల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో జయప్రదం చేయాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**దాతలకు ప్రత్యేక ఆహ్వానం :** ఒకరోజు ఆధిపత్యానికి రూ.2 లక్షలు ఇచ్చే దాతలకు శ్రీ గోదా శ్రీనివాస కళ్యాణంలో పాల్గొనే అవకాశంతో పాటు, చిన్న జీయర్ స్వామి వారు స్వయంగా వారి స్వగృహానికి విచ్చేసి కుటుంబ సమేతంగా మంగళాశాసనాలు అందజేస్తారు. రూ.లక్ష ఇచ్చే దాతలకు కళ్యాణంలో పాల్గొనే అవకాశం, స్వామి వారి ఆశీర్వచనం, సన్మానం ఉంటుంది. ఆలయ ఈవో వేణుగోపాలరావు మాట్లాడుతూ చిన్న జీయర్ స్వామి గుడివాడకు రావడం మహద్భాగ్యమని, భక్తులు పాల్గొని తరించాలని కోరారు. పర్వతనేని ఆనంద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం హిందూ ధార్మిక సంస్థల అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు.

## మహనీయుల పేరిట పురస్కారాలు ముదావహం - డా. పి.బి.డి.వి. ప్రసాద్



**గుడివాడ,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం, కృష్ణా జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో గుడివాడలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో స్మారక పురస్కారాల ప్రధానోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ భాషా పరిశోధకుడు, కవి, రచయిత డా. పి.బి.డి.వి. ప్రసాద్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ వంశీయులైన డా. కొండూరు వీర రాఘవాచార్యులు, డా. రాపాక ఏకాంబరాచార్యుల జయంతి సందర్భంగా వారి పేరిట పురస్కారాలు అందించడాన్ని ప్రశంసించారు. వీరిరువురూ విశ్వబ్రాహ్మణ సమాజానికి రెండు కళ్ల వంటి వారని కొనియాడుతూ, పురస్కార గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా శాఖ అధ్యక్షుడు చింతలూరి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యక్రమాలను వివరించారు. గుడివాడ పట్టణ ఉద్యోగుల సంఘ కార్యదర్శి వల్లభాపురపు కృష్ణ కిషోర్ స్వాగతం పలకగా, సంఘ నాయకులు భవిరి శంకర్ నాథ్, వసుధ బసవేశ్వరరావు, వంగిపురపు వీర రాఘవాచారి, ప్రముఖ కవి శిఖా ఆకాష్, గాయత్రి, విశ్వబ్రాహ్మణ మహిళా సంఘ అధ్యక్షురాలు చింతలూరి ఉమాదేవి, ఏకాంబరాచార్యుల కుమార్తె కనకమ్మ తదితరులు ప్రసంగించారు. తొలుత డా. కొండూరు వీరరాఘవాచార్యులు, డా. రాపాక ఏకాంబరాచార్యుల చిత్రపటాలకు పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు.

## 'అర్నాబ్' తుఫాను నేపథ్యంలో గుడివాడలో ముందస్తు చర్యలు ముమ్మరం



**గుడివాడ,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** 'అర్నాబ్' తుఫాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో గుడివాడ పురపాలక సంఘం పకడ్బందీ ముందస్తు చర్యలు చేపట్టింది.పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, శానిటేషన్ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఎస్. మనోహర్ ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**వేగవంతంగా డెసిల్టేషన్ పనులు :** కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా అరవపేటలోని చింతలకోడు డ్రైన్, శ్యామలకోడు డ్రైన్ మరియు దొండపాడు కాలువల్లో పేరుకుపోయిన పూడికను యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు. కాలువల్లో అడ్డుగా ఉన్న ప్లాస్టిక్, చెత్తను తొలగించి వర్షపు నీరు వేగంగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాలను అధికారులు స్వయంగా సందర్శించి ముంపునకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వర్షాల సమయంలో అంటువ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చర్యలను వేగవంతం చేశారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే బాధితులకు పునరావాసం కల్పించేందుకు కేంద్రాలను ముందస్తుగానే గుర్తించి సిద్ధం చేస్తున్నారు.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు :** తుఫాను అత్యవసర సేవలు, ఫిర్యాదుల కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉన్నా, సహాయం కావాలన్నా 8712624774 నంబరును సంప్రదించాలని కమిషనర్ కోరారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి పురపాలక సంఘానికి సహకరించాలని కమిషనర్ ఎస్. మనోహర్ విజ్ఞప్తి చేశారు.

## మూడోసారి గెలుపే లక్ష్యంగా 22వ వార్డులో అబ్బిరెడ్డి ప్రచార జోరు!

### ● అభివృద్ధే అజెండాగా ఇంటింటి ప్రచారం.. సైకిల్, గాజు గ్లాసు గుర్తులకు ఓటేయాలని విజ్ఞప్తి




**అమలాపురం,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మున్సిపాలిటీ 22వ వార్డులో ఎన్డీఏ కూటమి అభ్యర్థి అబ్బిరెడ్డి వెంకట నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వరుసగా మూడోసారి విజయం సాధించడమే లక్ష్యంగా వార్డులో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. గత పదేళ్లుగా తాను చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి, మరోసారి తనకు అవకాశం కల్పించాలని వార్డు ప్రజలను కోరుతున్నారు. గతంలో రెండుసార్లు తనను కౌన్సిలర్‌గా గెలిపించి మున్సిపల్ కౌన్సిల్‌కు పంపించిన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేశానని పేర్కొంటూ, మూడోసారి కూడా తనను ఆదరించి వార్డు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భాగంగా వార్డులోని తాగునీటి సరఫరా, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం వంటి ప్రధాన సమస్యలను ప్రస్తావించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డులో మౌలిక సదు-పాయాలను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు సైకిల్ గుర్తుపై, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్‌కు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కూటమి అభ్యర్థులను ఆదరించి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. 22వ వార్డులో అబ్బిరెడ్డి వెంకట నాగేశ్వరరావు చేపడుతున్న ప్రచార కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్నారు.

# బీసీ నినాదం.. ప్రజలతో అనుబంధం..

### ● బీరువాల బాబుకు రాజకీయ బలం! ● ప్రతి వార్డులో ఆత్మీయ స్వాగతం.. ● ప్రచారంలో ప్రజల పలకరింపులతో ఉత్సాహం!

**తిరువూరు,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** తిరువూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బరిలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పరసా శ్రీనివాసరావు (బీరువాల బాబు) ఎన్నికల ప్రచారంలో ప్రత్యేకంగా నిలుస్తున్నారు. బీసీ ప్రాతినిధ్యం ఒకవైపు.. ప్రజలతో ఉన్న అనుబంధం మరోవైపు.. గతంలో కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం ఇంకోవైపు..ఇవన్నీ ఆయన అభ్యర్థిత్వంపై పట్టణంలో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. ప్రతి వార్డులో ఆత్మీయ పలకరింపులు.. ప్రచారానికి ఉత్సాహం! తిరువూరు పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రచారానికి వెళ్లిన ప్రతిచోటా బీరువాల బాబుకు ప్రజల నుంచి ఆత్మీయ పలకరింపులు స్వాగతం పలుకుతున్నాయనే చర్చ సాగుతోంది. పరిచయస్తులు ఆప్యాయంగా పలకరించడం, స్థానికులు దగ్గరకు వచ్చి మాట్లాడటం, ప్రజలతో కలిసిమెలిసి ప్రచారం సాగించడం ఆయనకు ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని ప్రతిబింబిస్తున్నాయి. రాజకీయ ప్రచారానికి మించి ప్రజలతో ఏర్పడిన పరిచయాలు, సత్సంబంధాలు ఆయనకు ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తున్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం.. బీరువాల బాబుకు గుర్తింపు! పట్టణ ప్రజలకు సుపరిచితుడైన పరసా శ్రీనివాసరావు ప్రతి ఒక్కరితో సత్సంబంధాలు కొనసాగించే నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజల మధ్యకు వెళ్లినప్పుడు ఆత్మీయంగా పలకరించడం, వారి సమస్యలను తెలుసుకోవడం, అందుబాటులో ఉండే వ్యక్తిగా వ్యవహరించడం ఆయనకు అనుకూల అంశాలుగా కనిపిస్తున్నాయి. "మనకు తెలిసిన వ్యక్తి.. మన మధ్య ఉండే నాయకుడు" అనే భావన ప్రజల్లో ఆయనకు ఉన్న పరిచయాన్ని తెలియజేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. కౌన్సిలర్ అనుభవం.. పట్టణ సమస్యలపై అవగాహన! గత మున్సిపల్ బోర్డులో కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం బీరువాల బాబుకు మరో బలంగా భావిస్తున్నారు. పట్టణంలోని వార్డుల సమస్యలు, ప్రజల అవసరాలు, మున్సిపల్ పరిపాలనపై అవగాహన ఉండటం చైర్మన్ అభ్యర్థిగా ఆయనకు ప్రాధాన్యతను తీసుకొస్తోంది. ప్రజలతో ఉన్న పరిచయాలను, స్థానిక సమస్యలపై అవగాహనను ఎన్నికల ప్రచారంలో సమన్వయం చేసుకోవడం ఆయనకు కీలకంగా మారనుంది.

**బీసీలకు సముచిత స్థానం.. వైఎస్సార్‌సీపీ నిర్ణయంపై చర్చ!**

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన (గౌడ) సామాజిక వర్గ నాయకుడు పరసా శ్రీనివాసరావుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ




అవకాశం కల్పించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యంలో సముచిత స్థానం కల్పించాలనే అంశం ఈ ఎన్నికల్లో చర్చనీయాంశంగా మారుతోంది. బీసీ ప్రాతినిధ్యంతో పాటు, స్థానికంగా ప్రజలకు పరిచయమున్న నాయకుడిని అభ్యర్థిగా నిలపడం పార్టీకి అనుకూలంగా మారవచ్చునే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**ప్రజల ఆదరణ.. బీసీ ప్రాతినిధ్యం.. తిరువూరులో బీరువాల బాబు హాట్ టాపిక్!**

ప్రజల ఆత్మీయ పలకరింపులు, ప్రతి వార్డులో ఉన్న పరిచయాలు, పట్టణ సమస్యలపై అవగాహన, గత కౌన్సిలర్‌గా అనుభవం, బీసీ ప్రాతినిధ్యం..ఇవన్నీ బీరువాల బాబు అభ్యర్థిత్వానికి ప్రత్యేకతను తీసుకొస్తున్నాయి. ప్రచారంలో కనిపిస్తున్న ప్రజల స్పందన ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది. తిరువూరు మున్సిపల్ చైర్మన్ పోరులో సామాజిక సమీకరణాలతో పాటు వ్యక్తిగత అనుబంధాలు, ప్రజల ఆదరణ, స్థానిక సమస్యలపై అవగాహన కూడా కీలక పాత్ర పోషించనున్నాయి. ఈ నేపథ్యంలో బీరువాల బాబు ప్రచారం, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.

## తప్పులో కాలు వేసిన బుద్ధప్రసాద్....

### ● పొత్తు లేకపోయినా బిజెపి అభ్యర్థులను గెలిపించాలన్న మండలి



**పెడన,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** టిడిపి జనసేన బిజెపి అభ్యర్థులను కూడా గెలిపించండి అంటూ మండలి ప్రసాద్ తప్పులో కాలు వేశారు. అదేంటి అంటారా.... రాష్ట్రమంతా బిజెపి తో పొత్తులో ఉన్న టిడిపి జనసేనలు పెడన లో మాత్రమే అందుకు విరుద్ధంగా వ్యవహరించాయి. పొత్తు తో సంబంధం లేకుండా బిజెపి తమ అభ్యర్థులను ఇక్కడ కౌన్సిలర్స్ గా రెండు వార్డుల్లో నిలబెట్టింది. పట్టణ బీజేపీ అధ్యక్షుడు పత్తిపాటి రమణకు కూడా పొత్తులో భాగంగా వార్డు కేటాయించలేదు. గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రమంత బీజేపీ తో పొత్తు లేకపోయినప్పటికీ ఇక్కడ మాత్రం పొత్తు పెట్టుకుని బిజెపి అభ్యర్థిని బిజెపి గెలిపించింది. ఇప్పుడు రాష్ట్రమంతా పొత్తు ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం వారికి ఒక్క వార్డు కూడా కేటాయించకపోవడం విశేషం. ఆ సంగతి తెలియని బుద్ధ ప్రసాద్ బిజెపి అభ్యర్థులను కూడా గెలిపించాలని 17వ వార్డులో సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో చెప్పారు.

## కరాటే పోటీల్లో బంగారు, రజత, కాంస్య పతకాల సాధన



**హనుమాన్ జంక్షన్, అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** విశాఖపట్నం గాజువాకలో ఈ నెల 25న నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తేలప్రోలు టైగర్ పవర్ క్లబ్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు. కృష్ణా జిల్లా తరఫున ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొని జిల్లా జట్టుకు మూడో స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. కటాస్ విభాగంలో అసరపల్లి తేజేశ్వర్, గులిపల్లి పార్థివ్ త్రినేత్ర, గంటా సాయి ఫణి శశాంక్ బంగారు పతకాలు సాధించగా, మంత్రబుడ్డి మాన్విత్, మంత్రబుడ్డి జస్విత, వంజరపు దీపక్ నందన్, కట్టా మనోజ్, చింతల వేదాంక్షిత రజత పతకాలు గెలుచుకున్నారు. కుమిటే విభాగంలో కట్టా మనోజ్ బంగారు పతకం, మిగిలిన ఏడుగురు విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారు. వీరు త్వరలో చండీగఢ్‌లో జరిగే జాతీయస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కట్టా సుధాకర్ తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఆనాటి ప్రత్యర్థులే నేటి మిత్రులు... గతం గుర్తు చేసుకున్న మండలి



**పెడన,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** బొడ్డు వేణుగోపాలరావు తో తాను ఎక్కడ ఫైట్ చేసిన విషయాన్ని మండల ప్రసాద్ గుర్తు చేసుకున్నారు. జనసేన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాదు కూటమి అభ్యర్థులు తరుపున ప్రచారం నిర్వహించేందుకు సోమవారం నాడు పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ తాను గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం నిర్వహించేందుకు వేణుగోపాలరావు ఓడించేందుకు ఇక్కడ పనిచేశానని గుర్తు చేసుకున్నారు. ఆ ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్ గా వేణుగోపాలరావు గెలుపొందారు.అప్పటికీ ఇప్పటికీ రాజకీయాల్లో చాలా తేడా కనిపిస్తుందని మండలి అన్నారు. పురపాలక సంఘం కూటమి వశం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు

## వైసీపీ పాలన మనకొద్దు.. మండలి ..కాగిత



**పెడన,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** వైసిపి పాలన ఇకపై మనకు వద్దని శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ కాగిత కృష్ణ ప్రసాదులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 17వ వార్డులోని జనసేన అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ వీరు ప్రచారం నిర్వహించారు. పట్టణంలో గత వైసిపి పాలన అభివృద్ధిని అడ్డుకుందని విమర్శించారు. చేనేత క్లస్టర్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించడానికి నిరాకరించడమే అందుకు నిదర్శనం అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణులు రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలోపయనింప చేస్తున్నారని అన్నారు. పట్టణంలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అంకెమ్ లక్ష్మీ శ్రీనివాస్ లింగం నాగేశ్వరరావు కొరియర్ శ్రీను టిడిపి నాయకులు బొడ్డు వేణుగోపాలరావు యక్కల శ్యామలయ్య చైర్మన్ అభ్యర్థి బల్ల జోత్స్నారాణి కౌన్సిలర్ అభ్యర్థి ఫరా తదితరులు పాల్గొన్నారు.

## సీతనపల్లి లో ఎంపీటీసీ అభ్యర్థి బెనర్జీ కూటమి నాయుకులు ప్రచారం



**కృత్తివెన్ను,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం శీతనపల్లి ఎంపీటీసీ అభ్యర్థి ప్రత్తిపాటి బెనర్జీ అడ్డపర్ర ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సోమవారం పూజలు చేసి ప్రచారం ప్రారబించిన కూటమి అభ్యర్థి బెనర్జీ కూటమి నాయకులు.ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి సంక్షేమ లక్ష్యం అని ప్రభుత్వం చేపడుతున్న అన్ని సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించడమే కర్తవ్యం అని అన్నారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు

# మహర్షి వాల్మీకి ఆదర్శాలు, రామాయణ సందేశం సమాజానికి నిత్యనూతనం - జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



**విజయవాడ,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** మహాకావ్యం రామాయణాన్ని లోకానికి అందించిన ఆది కవి మహర్షి వాల్మీకి బోధనలు, జీవిత ఆదర్శాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యాన్ చంద్ర, తదితరులు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ దృఢ సంకల్పం, పరివర్తనతో సామాన్య వ్యక్తి కూడా మహర్షిగా మారవచ్చని వాల్మీకి తన జీవితం ద్వారా నిరూపించారని తెలిపారు. రామాయణం కేవలం ఒక పురాణ గ్రంథం మాత్రమే కాదని, మానవ విలువలు, కుటుంబ బాంధవ్యాలు, సమాజ హితాన్ని చాటిచెప్పే దివ్య ప్రబంధమని కొనియాడారు. రాముడి ద్వారా ఆదర్శ పాలన, ధర్మం, న్యాయం ఎలా ఉండాలో లోకానికి చూపిన మహోన్నత వ్యక్తి వాల్మీకి అని, ఆయన చూపిన బాటలో నడవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన గౌరవమని పేర్కొన్నారు. నేటి యువత రామాయణంలోని సద్గుణాలను అలవంచ్చుకుని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతలు, న్యాయం వెల్లివిరియడానికి మహర్షి వాల్మీకి సూచించిన నైతిక విలువలు ఎంతో దోహదపడతాయని అన్నారు. తప్పులను సరిదిద్దుకుని సన్మార్గంలో పయనించవచ్చనే గొప్ప సందేశం వాల్మీకి జీవితంలో కనిపిస్తుందని చెప్పారు. నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యాన్‌చంద్ర మాట్లాడుతూ, వాల్మీకి సాహిత్యం సాంస్కృతిక వారసత్వానికి మూలస్తంభమని, రామాయణం ద్వారా అందించిన నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.నరసింహాశీ, ఆర్డీవో వెన్నెల శ్రీను, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - తహశీల్దార్ డి. రిబ్కారాణి

● తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మండల అధికారి యంత్రంతో సమావేశమైన తహశీల్దార్

**జి.కొండూరు,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహశీల్దార్ డి.రిబ్కారాణి వెల్లడించారు.తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సోమవారం తహశీల్దార్ మండల అధికారి యంత్రాంగంతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. జి.కొండూరు సబ్ ఇన్స్పెక్టర్ కె.సతీష్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ షఫీ, ఇరిగేషన్ ఏఈ టి. రాజేష్, తదితర శాఖల అధికారులు సమావేశా నికి హాజరయ్యారు.బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నబ్ తుఫాను ప్రభావంతో అక్టోబర్ 27, 28, 29 తేదీలలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందని తెలియజేశారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం తుఫాను అక్టోబర్ 28వ తేదీ ఉదయం ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన యంత్రాలు, ఇతర సహాయక సామగ్రిని సిద్ధంగా ఉంచాలని మండల అధికార యంత్రాంగానికి తెలియజేశారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు.మరోవైపు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.



**ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు:** 1.అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దు.ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి. 2.విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, చెట్లు, పాత భవనాలు మరియు హోర్డింగులకు దూరంగా ఉండాలి. 3.ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సమయంలో చెట్ల కింద,బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు. 4.లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, కాలువలు మరియు వరదనీరు ప్రవహించే ప్రాంతాలకు దూరంగా ఉండాలి.ప్రవాహాలను దాటి వెళ్లే ప్రయత్నం చేయకూడదు. 5.ఇళ్లలోని విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా వినియోగించాలి.విద్యుత్ తీగలు తెగిపడినట్లు గమనిస్తే వాటిని తాకకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. 6.రైతులు ధాన్యం, కోసిన పంటలు మరియు వ్యవసాయ ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలి.అలాగే పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలి. 7.ఇంట్లో తాగునీరు, అవసరమైన ఆహార పదార్థాలు, మందులు, టార్చిలైట్, మొబైల్ ఫోన్ మరియు అత్యవసర వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలి. 8.అధికారులు సూచించినప్పుడు లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆలస్యం చేయకుండా సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలి. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు మరియు దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకో వాలి వహించాలి. 9.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్థానిక రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది లేదా సంబంధిత అత్యవసర సేవలను సంప్రదించాలని సూచించారు.లేదా మండల కంట్రోల్ రూమ్ నంబర్ 8985818829 ను సంప్రదించాలని తహశీల్దార్ కోరారు.

# తిరువూరు 26వ వార్డులో వైసీపీ ప్రచార జోరు.. ఖాసీం వలికి జాకీర్ భాయ్ , శీలి నాని , యువ నాయకుడు రఫీ అండదండలు!

ఖాసీం వలి గెలుపే లక్ష్యంగా సమష్టిగా ప్రచారం.. 26వ వార్డులో వైసీపీ శ్రేణుల హడావిడి!

**తిరువూరు,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** తిరువూరు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 26వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థి షేక్ ఖాసీం వలి గెలుపే లక్ష్యంగా నియోజకవర్గ ముస్లిం మైనారిటీ వైసీపీ సీనియర్ నాయకులు షేక్ జాకీర్ హుస్సేన్ (జాకీర్ భాయ్), తిరువూరు పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు శీలి నాని, వార్డు వైసీపీ యువ నాయకులు షేక్ రఫీ అండగా నిలుస్తూ ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఖాసీం వలికి జాకీర్ భాయ్ అండ.. శీలి నాని మద్దతు.. యువ నాయకుడు రఫీ తోడుగా! వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ, అభ్యర్థి విజయానికి నాయకులు సమష్టిగా కృషి చేస్తున్నారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ఓటర్లను కలిసి వైసీపీకి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ముఖ్యంగా జాకీర్ భాయ్,



శీలి నాని, యువ నాయకుడు రఫీ ఖాసీం వలికి మద్దతుగా నిలుస్తూ ఎన్నికల ప్రచారంలో తమదైన పాత్ర పోషిస్తున్నారు.

# " చెప్పాం.... చేస్తున్నాం " అన్న నినాదంతో స్థానిక ఎన్నికల్లో ప్రజల ముందుకు వచ్చింది కూటమి ప్రభుత్వం..

-టీడీపీ నేత చింతల సీతారామయ్య

**పెనుగంచిప్రోలు,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** మాట నిలబెట్టుకున్నాం... కాబట్టే గర్వంగా ప్రజల ముందుకు వచ్చి ఓటు అడుగుతున్నామని పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య అన్నారు. నవంబర్ మూడో తేదీన జరగబోయే జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారాన్ని పెనుగంచిప్రోలు గ్రామంలోని తూర్పు బజార్ బోసుపేటలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనులను బేరీజు వేసుకొని జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో జెడ్ పిటిసి అభ్యర్థి జిల్లేపల్లి సుదీర్ బాబు,1వ సెగ్మెంట్ ఎంపిటిసి అభ్యర్థి ఐ తమల్ల గోపాలరావు,, 2 వ సెగ్మెంట్ ఎంపిటిసి అభ్యర్థి మాదినేని విక్రమ్, 3 వ సెగ్మెంట్ ఎంపిటిసి అభ్యర్థి గజ్జి విజయలక్ష్మి, 4 వ సెగ్మెంట్ ఎంపిటిసి అభ్యర్థి గజ్జి కృష్ణ మూర్తి, శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి



ఆలయచైర్మన్ చుంచు రమేష్ బాబు, మాజీ చైర్మన్లు నూతల పాటి చెన్న కేశవరావు కాకాని శ్రీనివాసరరావు గింజూపల్లి గోపి చంద్, ముళ్లపాటి ప్రసాద్ మాస్టర్ పెనుగంచిప్రోలు మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మాదల శ్రీనివాసరావు, కార్యదర్శి బోళ్ల రవికుమార్, లగడపాటి వినయ్ లగడపాటి ప్రవీణ్, జిల్లేపల్లి ప్రభాకారరావు ముళ్లపాటి రాము, ముళ్లగిరి రాంబాబు, కనపర్తి శ్రీను షేక్ రహీమ్ షేక్ జానీ నల్లపునేని జ్యోతి, సూర్య కుమారి, బొర్రా రమేష్ గుగులోత్ రమేష్ తెలుగు మహిళలు, నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆయన మాట విని చూపు సరిగా లేని వృద్ధురాలు సైతం లేచి నమస్కరించిన వైనం!

**విస్సన్నపేట,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో పుట్రేల గ్రామపంచాయతీ వీర రాఘవపురం దళితవాడలో రాష్ట్ర వైసీపీ కార్యవర్గ సభ్యులు మద్దిరెడ్డి సూర్యానారాయణ రెడ్డి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించారు. గడపగడపకు ప్రచారం చేస్తున్న సమయంలో ఒక ఇంటి వద్ద మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి అమ్మ బాగున్నావా అన్న మాటకు కంటి చూపు సరిగా లేని అవ్వ సైతం లేచి నామస్కరిస్తూ బాగున్నాను సార్ అని అనటం పరిసర ప్రాంత వాసులు అవాక్ అవటం జరిగింది. నేనెవరో తెలుసా అంటే మీరు ఎందుకు తెలియదండి సూరి రెడ్డి గారు కదా నేను ఎరుగుదును అని చెప్పటంతో అందరూ ఆశ్చర్యపోయారు. గతంలో చేసిన సాయం గుర్తుంచుకొని మరి గౌరవించడం అంటే ఇదేనేమోనని కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. పుట్రేల గ్రామం తో పాటు పరిసర ప్రాంత గ్రామాలలో కూడా ఆయన చేసిన సేవలు పలు గ్రామాలకు



వితరణగా మంచినీళ్ల ట్యాంకర్ల పంపిణీ, బడులు గుడులు చర్చిలు మసీదులు అభివృద్ధికి ఆర్థిక చేయూత పొందిన వారు ఎవరు మర్చిపోలేదు మర్చిపోరు అని చెప్పటానికి ఇది ఒక ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పుకోవచ్చు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీపీ అభ్యర్థిని నెక్కలపు వాణిశ్రీ పుట్రేల రెండు ఎంపీటీసీ అభ్యర్థినిగా పోటీలో ఉండటంతో ప్రచార కార్యక్రమాన్ని ఆ సెగ్మెంట్ పరిధిలోని వీరరాఘవపురం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. జడ్పిటిసి అభ్యర్థినిగా ముదిరాజ్ సామాజికనికి చెందిన గామాసు రాధ పోటీ చేస్తున్నారని ఇద్దరు గుర్తులు ఫ్యాన్ గుర్తులని తమ పవిత్రమైన ఓటును ఫ్యాన్ గుర్తులకు వేయవలసిందిగా అందరితో ఆప్యాయంగా అభిమానంగా పలకరిస్తూ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర రెడ్డి, అప్పి రెడ్డి, సాంబశివరావు, మంగళపూడి పుల్లారావు, జక్కంపూడి రామకృష్ణ, కారుమంచి బజార్ గరికపాటి వెంకటేశ్వరరావు నాగేశ్వరరావు మోరంపూడి రాఘవరావు సత్యనారాయణ ,భాస్కరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# కట్టుబడిపాలెంలో డాక్టర్. రేవతి చంద్రిక విస్తృత ప్రచారం

● ఎంపీపీ అభ్యర్థి గేరా అనిత విజయ్ ,ఎంపీటీసీ అభ్యర్థి లక్ష్మణరావు లతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డాక్టర్.వేములకొండ ● గడపగడపకు వెళ్లి తమను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించిన జెడ్పీటీసీ,ఎంపీటీసీ అభ్యర్థులు









**జి.కొండూరు,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** జి.కొండూరు మండల జెడ్పిటీసీ అభ్యర్థి వేముల డాక్టర్.వేములకొండ రేవతి చంద్రిక, ఎంపీపీ అభ్యర్థి గారా అనిత విజయ్ ఎంపీటీసీ అభ్యర్థి బుస్సు లక్ష్మణరావు లు కట్టుబడిపాలెంలో సోమవారం స్థానిక నాయకు లు కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు.గ్రామంలో గడపగడప కు వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించా రు.జి.కొండూరు మండల అభివృద్ధి ప్రధాన ఎజెండాగా పనిచేస్తామని ప్రజలకు హామీ ఇచ్చా రు.సోమవారం సాయంత్రం చెర్వు మాధవరం, మునగపాడు గ్రామాలలో జెడ్పిటీసీ అభ్యర్థి డాక్టర్. రేవతి చంద్రిక చెర్వు మాధవరం ఎంపీటీసీ అభ్యర్థి గుగులోతు నాగేశ్వరరావు తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.ఆమె వెంట జి.కొండూరు మండల పార్టీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు లంక నాగేశ్వరరావు కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నా రు.

# అగ్రిస్టాక్‌పై జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్..

● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఛైర్మన్‌గా కార్యకలాపాలు ● ఆధునిక సాంకేతికతతో రైతులకు మెరుగైన సేవలు అందేలా కార్యాచరణ ● జిల్లా అవసరాలకు అనుగుణంగా వినూత్న ప్రతిపాదనల రూపకల్పన

**విజయవాడ,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** వ్యవసాయ రంగంలో డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేయడం, రైతులకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా ఎన్టీఆర్ జిల్లాలో అగ్రిస్టాక్ జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. దీనిద్వారా మంచి ఫలితాలు రావాలంటే సమన్వయ శాఖల అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్‌రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన నూతనంగా ఏర్పడిన టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అధికారి సభ్య కార్యదర్శి/కన్వీనర్‌గా ఉంటారని, అదే విధంగా డీఆర్‌వో, డీపీవో, డీసీవో, డీహెచ్‌వో తదితరులు సభ్యులుగా ఉంటారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు వ్యవసాయానికి సంబంధించిన సమాచారాన్ని డిజిటలైజ్ చేయడం, అందుబాటులో ఉన్న సమాచారాన్ని సమర్థవంతంగా వినియోగించడం, జిల్లాకు అనువైన వినూత్నమైన, ఆచరణ సాధ్యమైన డిజిటల్ వ్యవసాయ కార్యక్రమాలను గుర్తించడం ఈ టాస్క్‌ఫోర్స్ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. వివిధ శాఖల సమన్వయంతో అగ్రిస్టాక్ సమాచారాన్ని పూర్తిస్థాయిలో నమోదు చేయడం, అమలు పురోగతిని సమీక్షించడం, జిల్లాకు అనువైన వినూత్న కార్యక్రమాలను గుర్తించడం, వాటి అమలుకు అవసరమైన ప్రతిపాదనలను రూపొందించడం వంటి అంశాలపై టాస్క్‌ఫోర్స్ దృష్టిసారిస్తుందన్నారు. గుర్తించిన అంశాలపై రూపొందించిన ప్రతిపాదనలను డ్యాష్‌బోర్డులో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని.. అందువల్ల త్వరితగతిన సమాచారాన్ని అందించాలని




సూచించారు. డిజిటల్ వ్యవసాయ సేవలను బలోపేతం చేసి, రైతులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు వీలుకల్పించే కార్యాచరణపై దృష్టిసారించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో జిల్లా బలాలు, గుర్తించిన సమస్యలు, సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు, వినూత్న యూజ్‌కేస్‌ల వినియోగం, పైలట్ ప్రాజెక్టులు తదితరాలపై దృష్టిసారించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా వ్యవసాయ అధికారి సీహెచ్ తిరుమలాదేవి, సీపీవో వై.శ్రీలత, మార్క్‌ఫెడ్ డీఎం నాగమల్లిక తదితరులు పాల్గొన్నారు.

# బాపులపాడు-1 సెగ్మెంట్‌లో బీజేపీ అభ్యర్థి ప్రచారం ప్రారంభం



**హనుమాన్ జంక్షన్, అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం బాపులపాడు-1 సెగ్మెంట్ బీజేపీ అభ్యర్థి తోట మురళీధర్ సోమవారం ఇందిరానగర్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని బీజేపీ మేనిఫెస్టోను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానని తెలిపారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి నాయకులు జింకా వరిగంజి కిషోర్, కొలసాని శివలీల, పరుచూరి సుజిని, జింకా నలగామరాజు, తోట శ్రీరామ్, దరిసే రాజు, మోచర్ల రవికుమార్, సుంకర అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకారాలు..



**నూజివీడు,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** నూజివీడు లో చనుబండ రైతుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పని చేస్తున్నాయని చనుబండ ప్రాథమిక సహకార సంఘ చైర్పర్సన్ మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు.ఇటీవల మరణించిన చనుబండ సహకార సంఘ సభ్యులైన కటకం సత్యనారాయణ బన్నే మహేశ్వరరావుల కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున వారి వారి కుటుంబాలకు మోరంపూడి శ్రీనివాసరావు అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపద సమయంలో రైతుల కుటుంబ సభ్యులకు అండగా ఉండటమే సహకార సంఘం యొక్క లక్ష్యం అని మోరంపూడి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటేశ్వరరావు, షేక్ రియాజ్ గజవెల్లి శ్రీనివాసరావు, ధర్మరాజుల దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.

# పెరికీడులో ప్రమీలారాణి ఎన్నికల ప్రచారం

గంగానమ్మ ఆలయంలో పూజల అనంతరం ఇంటింటికీ ప్రచారం



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని పెరికీడు ఎంపీటీసీ అభ్యర్థి బేతాళ ప్రమీలారాణి తెలిపారు. సోమవారం బాపులపాడు మండలం పెరికీడులోని గంగానమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి వార్డులో పర్యటిస్తూ ప్రజలను కలుసుకున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్య పరిష్కారం, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలతో పాటు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని వివరించారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని పేర్కొంటూ గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో తెలుగుదేశం, జనసేన నాయకులు వేగిరెడ్డి పాపారావు, మీసాల అర్జునరావు, ఆరేపల్లి సుబ్బారావు, గొట్టాపు ప్రవీణ్, బందారు లక్ష్మీ ప్రసన్నతో పాటు కూటమి కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బాపులపాడు ఎంపీటీసీ-2 అభ్యర్థి శ్రీలక్ష్మి ముమ్మర ప్రచారం



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 26 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం ఎంపీటీసీ-2 సెగ్మెంట్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి బలపరిచిన అభ్యర్థి కారుమూరి శ్రీలక్ష్మి మంగళవారం రెండో వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆశీస్సులతో ప్రజల్లోకి వెళ్లిన ఆమె ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. కూటమి అభ్యర్థిగా తనకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరుతూ ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాస్, మండల కార్యనిర్వాహక కార్యదర్శి మొవ్వ వేణుగోపాల్, కడవకొల్లు నాగరాజు, సుంకర రాము, కడవకొల్లు రాజేష్, షేక్ సత్తార్, షాహీదా, బోను ఉదయకుమార్, సాయి, యడవల్లి వాసు, దిలీప్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188